ఉష్ణోగ్రత బుధవారం గరిష్ఠం : 30.0 కనిష్ఠం : 23.0

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5



శ్రీ సత్యసాయి జిల్లా వార్తలు

గురువారం 9 అక్టోబరు 2025



నడి రోడ్డుపై పసిపిల్లలు

పసి చేతుల వేడుకోలు..!

కొడికొండ చెక్‌పోస్టులో చిన్నారులతో భిక్షాటన

అయ్యో.. పసివాళ్లే..
అభం.. శుభం తెలియనోళ్లే..
హాయిగా ఆడుకోవాల్సినోళ్లు..
అడుక్కోవడం ఏంటి?

యూనిఫాం వేసేసుకుని..
బుక్కుల బ్యాగు తగిలేసుకుని..
టాటా చెప్పాల్సిన చిన్నిచేతులు..
చాచి.. యాచించడం ఏంటి?

పొద్దుపొద్దునే
ముద్దాడాల్సిన పెద్దోళ్లే..
నడి రోడ్డుపై భిక్షాటనకు
వదిలేస్తున్నారు..
సాయంత్రం వచ్చి.. పైసలు
లాగేసుకుంటున్నారు..
ఛీ.. ఛీ.. సిగ్గు.. సిగ్గు..

పిల్లల చదువుకు
కోట్లు ఖర్చు చేసి ఏం లాభం?
అందరినీ చదివించమని
వేలు, లక్షలు జీతాలిస్తోంది..
అధికారులకా? మరబొమ్మలకా?



కొడికొండ చెక్‌పోస్టులో లారీ డ్రైవర్ వద్ద యాచిస్తున్న చిన్నారులు

- ఉదయాన్నే వదిలేసి.. సాయంత్రం తీసుకెళ్తున్న వైనం
- యాచించిన సొమ్ము తీసేసుకుంటున్న దుస్థితి
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు

చిలమత్తూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): అభం శుభం తెలియని చిన్నారులతో భిక్షాటన చేయిస్తున్నారు. కొందరు తల్లిదండ్రులు జీవనోపాధిలో భాగంగా పసిమొగ్గలను యాచక వృత్తిలోకి దించుతున్నారు. ఎదురైన ప్రతి ఒక్కరిని చేయి చాచి భిక్షాటన చేస్తున్న పసిమొగ్గలను చూస్తే మనసు కలచివేస్తోంది. చెయ్యి చాచి అడిగితే కొందరు చిల్లర ఇస్తున్నారు. మరికొందరు తినుబండారాలు అందిస్తున్నారు. దీనిని పిల్లల సంరక్షకులు ఆసరాగా తీసుకుంటున్నారు. వారితో భిక్షాటన చేయిస్తున్నారు.

పొద్దున్నే వదిలేస్తున్నారు..

రోజూ ఉదయాన్నే చిన్నారులను కొడికొండ చెక్‌పోస్టులోని ప్రధాన కూడలిలో వదిలేసి వెళ్తున్నారు. అప్పటి నుంచి రాత్రి చీకటి పడే వరకు పిల్లలు యాచిస్తూ కనిపిస్తున్నారు. నడకడం కూడా సరిగారాని పసివాళ్లు రహదారిపై భిక్షాటన చేస్తున్నారు. ఐదు నుంచి పదేళ్లలోపు పిల్లలు ఈ కూడలిలో ఎక్కడ వాహనం నిలిపినా పరుగున అక్కడికి చేరుకుని, అడుక్కుంటున్నారు. సాయంత్రం కాగానే పిల్లల వద్ద ఉన్న చిల్లరను సేకరించుకుని, సంరక్షకులు వారిని ఇళ్లకు తీసుకెళ్తున్నారు. రోజూ ఎంతో కొంత ఆదాయం వస్తుండడంతో పిల్లలను ఇదే వృత్తికి అలవాటు చేస్తున్నారు. ఈ తంతు కొడికొండ చెక్‌పోస్టులో చాలాకాలంగా కొనసాగుతోంది. పిల్లలతో పాటు కొంతమంది మహిళలు సైతం ఇదే వృత్తిని కొనసాగిస్తున్నారు.

బడికి వెళ్లాల్సిన వయసులో భిక్షాటన

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చిన నిర్బంధ విద్యా హక్కు చట్టం నీరుగారిపోతోంది. ప్రతి ఒక్కరినీ విద్యావంతులను చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వాలు చేస్తున్న చట్టాలు అమలుకు నోచుకోవట్లేదు. వేల కోట్ల రూపాయలు విద్య కోసం ఖర్చుచేస్తున్నా... అందుకు తగిన ప్రతిఫలం దక్కలేదనే చెప్పాలి. కొడికొండ చెక్‌పోస్టులో రోజూ బడిఈడు పిల్లలు యాచిస్తుండడమే ఇందుకు నిదర్శనం. కొడికొండ చెక్‌పోస్టులోనే కాదు... చిలమత్తూరులో సైతం కొందరు పిల్లలు బడికి వెళ్లకుండా అందరి వద్ద యాచిస్తూ కనిపిస్తున్నారు. ఇటువంటి పిల్లలకు బంగారు భవిష్యత్తు ఇవ్వాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు.

పట్టించుకోని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ

చిన్నారుల ఆలనాపాలనా చూసే స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కొడికొండ చెక్‌పోస్టులో జరుగుతున్న అమానవీయ ఘటనను పట్టించుకోవట్లేదు. నిత్యం భిక్షాటన చేస్తున్న చిన్నారులను గుర్తించి వారికి బంగారు భవిష్యత్తు ఇవ్వడంలో అధికారులు విఫలమయ్యారనే చెప్పవచ్చు. కనీసం అడుగులు వేయలేని పిల్లలను సైతం రోడ్డుపై వదిలేసి భిక్షాటన చేయిస్తున్నా వారిని పట్టించుకోకపోడం విశేషం. పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్య అందించాల్సిన సమయంలో ఇలా భిక్షాటన చేయిస్తున్న తల్లిందండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు మేల్కోవాలని పసిచేతులు వేడుకుంటున్నాయి. యాచించే తమ చేతులతో అక్షరాలు దిద్దించి, బంగారు భవిష్యత్తు ఇవ్వాలని వేడుకుంటున్నాయి.

చిన్నారులను సంరక్షిస్తాం

కొడికొండ చెక్‌పోస్టులో చిన్నారులతో భిక్షాటన చేయిస్తున్నట్లు తెలిసింది. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి, పిల్లలను బడిలో చేర్చే విధంగా చర్యలు తీసుకుంటాం. పిల్లలను భిక్షాటనకు దించితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

- వరలక్ష్మి,
సీడీపీఓ, హిందూపురం

ధరల తగ్గుదలపై ప్రజల్లో సంతృప్తి

- మంత్రి సవిత



పేస్ట్‌పై తగ్గిన జీఎస్టీని చూపుతున్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ సంస్కరణల కారణంగా ధరలు తగ్గడంపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ కార్యక్రమాన్ని బుధవారం పట్టణంలో చేపట్టారు. మంత్రి నివాసం నుంచి ర్యాలీగా బయలుదేరి వ్యాపారులు, ప్రజలకు జీఎస్టీపై అవగాహన కల్పించారు. మంత్రి సవిత మాట్లాడుతూ.. ధరలు తగ్గడంతో పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో మేలు చేకూరుతోందన్నారు. రాష్ట్రంలో రూ.8 వేల కోట్ల భారం పడుతుందని తెలిసినా సీఎం చంద్రబాబు జీఎస్టీ సంస్కరణలను స్వాగతించారన్నారు. ఉచిత ఇసుక విధానం నిర్మాణ రంగానికి ఊతమిస్తోందన్నారు. గతంలో రూ.5వేలకు లభించే ఇసుక ప్రస్తుతం రూ.1500కే అందుబాటులో ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఆనంద్‌కుమార్, కమిషనర్ సతీష్‌కుమార్, నాయకులు శ్రీరామ్, షౌకత్, బీజేపీ రామక్రిష్ణ, బాబుల్‌రెడ్డి, త్రివేంద్ర, ఎగువగడ్డ కృష్ణమూర్తి, రఘు, కౌన్సిలర్లు హనుమంతు, గిరి పాల్గొన్నారు.

రోడ్లకు మహర్దశ

- మరమ్మతులకు ప్రభుత్వం చర్యలు
- ఉమ్మడి జిల్లాలో పెద్దఎత్తున పనులకు గ్రీన్‌సిగ్నల్


6

పీజీ అడ్మిషన్స్ తేదీల్లో మార్పు

7

కళ్లు మూసుకుని చేసేశారు..!

రికార్డులు చూడకుండా భూమి రిజిస్ట్రేషన్



భూమిలో ఏర్పాటుచేసిన బోర్డు

- 2009లో కొనుగోలు చేసిన కవలూరు కృష్ణ
- అప్పటి నుంచి రెవెన్యూ రికార్డుల్లో ఆయన పేరే..!
- జూన్‌లో టీడీపీ నాయకుడి భార్య పేరిట రెండో రిజిస్ట్రేషన్
- సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు బాధితుల ఫిర్యాదు
- క్షేత్రస్థాయి విచారణ పూర్తి.. జిల్లా అధికారులకు నివేదిక

రిజిస్ట్రేషన్ శాఖ అధికారుల నిర్లక్ష్యమో.. అవినీతి వ్యవహారమో తెలియదుగానీ, రూ.4 కోట్ల విలువైన భూమిని డబుల్ రిజిస్ట్రేషన్ చేశారు. డాక్యుమెంట్లను పరిశీలించలేదు.. వెబ్‌ల్యాండ్‌ను గమనించలేదు..! 'వచ్చింది అధికార పార్టీ వారు.. నిబంధనలు పాటించాల్సిన పనిలేదు' అనుకున్నారో ఏమో.. రిజిస్ట్రేషన్ చేసేశారు. ఈ పని పూర్తి కాగానే 'డబుల్ రిజిస్ట్రేషన్' హక్కుదారులు వెళ్లి ఆ భూమిలో బోర్డు పాతేశారు. విషయం తెలుసుకున్న బాధితులు గోడోమంటూ అధికారులను కలిశారు. ఇక్కడ పని జరిగేలా లేదని భావించి, ముఖ్యమంత్రి చంద్రబాబుకు, మంత్రి నారా లోకేశ్‌కు మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశారు. అనంతపురం రూరల్ మండలంలోని ఎ.నారాయణపురం వద్దనున్న ఈ భూ వివాదానికి కారణమైన రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు.. ఏమీ ఎరగనట్లున్నారు..!

అనంతపురం రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా కేంద్రం సమీపంలో ఎకరం భూమి డబుల్ రిజిస్ట్రేషన్ వ్యవహారం వివాదాస్పదంగా మారింది. దీని వెనుక అధికార తెలుగుదేశం పార్టీకి చెందినవారు ఉండటం, ఏకంగా సీఎం పేషీ వరకూ వెళ్లడంతో రెవెన్యూ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. అనంతపురం రూరల్ మండలంలోని ఎ.నారాయణపురం గ్రామ సర్వే నంబరు 156-2లో ఎకరం భూమి ఉంది. ఈ భూమిని 2009లో బిల్లే ఎర్రప్పగారి కుమారులు నాగేష్, శివయ్య అనంతపురం నగరానికి చెందిన కవలూరు కృష్ణకు విక్రయించారు. ఆ భూమిని కృష్ణ రిజిస్ట్రేషన్ చేయించుకుని, రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయించుకున్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ రెవెన్యూ రికార్డులో ఆయన పేరే ఉంది. అయితే ఈ ఏడాది జూలైలో అదే భూమిని అనంతపురం నగరానికి చెందిన యతిరాజుల త్రిపురాంబ, సరస్వతి, యతిరాజుల కిరణ్ కుమార్ తదితరుల నుంచి కనగానపల్లి మాజీ ఎంపీపీ, ముత్తవకుంట్ల గ్రామానికి చెందిన పద్మగీత (టీడీపీ నాయకుడు ముకుందనాయుడు భార్య) కొనుగోలు చేసినట్లు అనంతపురం అర్బన్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అధికార పార్టీ వారు కావడంతో రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు రికార్డులను పట్టించుకోకుండా డబుల్ రిజిస్ట్రేషన్

(మిగతా 7లో...)

- 70 శాతం పంట కోతలు పూర్తి
- ఎకరాకు క్వింటం నుంచి 2 క్వింటాళ్లలోపే దిగుబడి
- పంటకోత ప్రయోగాల్లోనూ తగ్గినట్లు తేటతెల్లం
- కీలక దశల్లో వెంటాడిన వర్షాభావం
- పెట్టుబడి ఖర్చులూ రాని దుస్థితి
- లబోదిబోమంటున్న రైతాంగం



బ్రహ్మసముద్రం వద్ద ఎండిన వేరుశనగ పంట (ఫైల్)



పెట్టుబడులు మట్టిపాలు..!

వేరుశనగ రైతుకు దిగుబడి దిగులు

అనంతపురం అర్బన్/గుత్తి రూరల్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీఫ్‌లో వర్షాధారం కింద మెట్టపొలాల్లో సాగు చేసిన వేరుశగన పంట దిగుబడి దిగాలుగా మారింది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. గతేడాది తరహాలోనే ఈసారి ఖరీఫ్‌లో వర్షాభావం వెంటాడింది. పంట కీలక దశల్లో వాన పడక పోవడంతో దిగుబడి భారీగా తగ్గింది. జిల్లాలోని ఎక్కువ శాతం ప్రాంతాల్లో ఎకరాకు క్వింటా నుంచి 2 క్వింటాళ్లలోపే దిగుబడి వచ్చింది. వ్యవసాయ, ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పంట కోత ప్రయోగాల్లోనూ దిగుబడి తగ్గినట్లు (మిగతా 6లో...)

ఎకరాలో రూ.30 వేల నుంచి రూ.45 వరకు పెట్టుబడులు పెట్టి, వేరుశనగ సాగు చేశారు. కీలక దశల్లో వర్షాభావం వెంటాడింది. దిగుబడి లేదు. ఎకరాకి 10 క్వింటాళ్లు రావాల్సిన దిగుబడులు ఒకటి నుంచి రెండు లోపే వచ్చాయి. క్వింటా ధర రూ.5 వేల లోపే పలుకుతోంది. ఈ లెక్కన పెట్టుబడులను రైతులు పూర్తిగా కోల్పోతున్నారు. కూలి ఖర్చులు కూడా దక్కని దుస్థితి. అప్పుల పాలయ్యామని అన్నదాతలు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు.

పెదయ్య కరుణ అందరిపై ఉండాలి

- మంత్రి సత్యకుమార్ యాదవ్



ఢమరుకాన్ని వాయిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్



గుడికట్ల పూజారితో పరిటాల శ్రీరామ్

తాడిమర్రి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఆర్వేడు పెదయ్యస్వామి కరుణా కటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని మంత్రి సత్యకుమార్‌యాదవ్ అభిలషించారు. రెండురోజులుగా జరుగుతున్న ఆర్వేడుపెదయ్యస్వామి ఉత్సవాలు బుధవారం ముగిశాయి. ఈ ఉత్సవాలకు మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎంపీ బీకేపార్థసారథి, నియోజకవర్గ టీడీపీ పరిటాలశ్రీరామ్, జనసేన నాయకులు చిలకం మధుసూదన్‌రెడ్డి హాజరయ్యారు. వారికి కార్యక్రమ నిర్వాహకులు, గ్రామప్రజలు ఘన స్వాగతం పలికారు. భేటీ అయిన దేవుళ్లకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ అనాదిగా వస్తున్న సంప్రదాయాలను నేటి యువత పాటించాలన్నారు. 77 గుడికట్లలో పూజలందుకుంటున్న ఏకైక దేవుడు పెద్దయ్య స్వామి కరుణ ప్రజలందరిపై ఉండాలని మొక్కుకున్నారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు కూచిరాము, హర్ష, సామకోటి ఆదినారాయణ, యల్లప్ప, అశ్వత్థ, వీరాంజనేయులు, బీజేపీ నాయకులు గంగులకుంట గోపాల్‌రెడ్డి, దేవర రాము, నాగార్జున, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకుల పూజలు

కూటమి నాయకులందరూ పెదయ్యస్వామిని దర్శించుకుని వెళ్లిన తర్వాత మాజీమంత్రి మాలగుండ్ల శంకరనారాయణ, మాజీ ఎంపీ గోరంట్లమాధవ్, మాజీ డీసీఎంఎస్ ఛైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి ప్రాంగణానికి చేరుకుని పూజలు నిర్వహించారు. అంతకుముునుపు కూటమి నాయకులు పూజా కార్యక్రమంలో ఉండటంతో మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌ను పోలీసులు ప్రాంగణానికి వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి.

కన్నుల పండువగా ఉత్సవాలు

మండలకేంద్రంలో రెండురోజులుపాటు నిర్వహించిన ఆర్వేడుపెదయ్యస్వామి ఉత్సవాలు బుధవారం ముగిశాయి. తెల్లవారుజామున స్వామివారికి బలి సమర్పించి, పూజలు నిర్వహించారు. మంగళవారం అర్ధరాత్రి సమయానికి దాదాపు 24గుడికట్ల స్వాములు ప్రాంగణానికి చేరుకున్నాయి. బుధవారం ఉదయం అన్ని స్వాములకు పూజలు నిర్వహించి యల్లమ్మ, పెద్దమ్మ దేవతలను అలంకరించి చీరలను సమర్పించారు. అన్నిస్వాములను ఒకే ప్రాంగణంలో కొలువు తీర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుడికట్ల సంప్రదాయాలు నిరంతరం కొనసాగాలని ప్రజలు సుభీక్షంగా ఉండాలని పూజారులు శివయ్య, యల్లప్పలు స్వామివారికి నివేదనలు సమర్పించారు. పూజా కార్యక్రమాలు సాయంత్రంవరకు కొనసాగాయి. దాదాపు 20వేల మంది భక్తులు హాజరు కాగా అందరికి గుడికట్ల ఆధ్వర్యంలో భోజన వసతి కల్పించారు.

పూజలందుకుంటున్న స్వాములు



పోక్సో కేసులో 20 ఏళ్ల జైలు శిక్ష

పుట్టపర్తిరూరల్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి అనంతపురం పోక్సో కోర్టు 20 ఏళ్ల జైలుశిక్ష విధించింది. రూ.5వేల జరిమానా వేస్తూ బుధవారం తీర్పు వెలువరించింది. బాధిత బాలికకు రూ.4.50 లక్షల పరిహారం చెల్లించాలంటూ కోర్టు ఆదేశించింది. ఈ విషయాన్ని ఎస్పీ సతీష్‌కుమార్ ప్రకటన ద్వారా తెలియజేశారు. ఆ మేరకు వివరాలిలా ఉన్నాయి. 2020 డిసెంబరులో నల్లమాడ మండలానికి చెందిన బాలికపై బండి ఆదినారాయణ అత్యాచారానికి ఒడిగట్టాడు. అప్పట్లో నల్లమాడ పోలీసులు కేసునమోదు చేశారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. వాదోపవాదాలు విన్న న్యాయస్థానం తీర్పు వెలువరించింది. ముద్దాయికి శిక్షపడేలా పనిచేసిన అధికారులను ఎస్పీ అభినందించారు.

కొత్త టీచర్లకు వెబ్ కౌన్సెలింగ్..?

- నేడు ఆప్షన్లు.. రేపు ఆర్డర్లు..!
- కమిషనర్ కాన్ఫరెన్స్‌లో స్పష్టత వచ్చే అవకాశం

7

నిశ్శబ్దం..!

- ఐసీడీఎస్ పీడీ సస్పెన్షన్‌తో ఉలిక్కిపడ్డ ఉద్యోగవర్గాలు
- కార్యాలయంలో కనిపించని మునుపటి సందడి
- శిశుగృహంలో అక్రమాలపై ప్రభుత్వానికి నివేదిక

7

బాలుడి మృతి కేసులో అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా అరెస్టు

తనకల్లు, అక్టోబరు8(ఆంధ్రజ్యోతి): బాలుడి మృతి కేసులో మండలంలోని ముత్యాలవారిపల్లిలో అంగన్‌వాడీ కార్యకర్తగా పనిచేస్తున్న పుష్పాల రాధమ్మ, ఆయా కత్తి కుళ్లాయమ్మను బుధవారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ గోపి తెలిపారు. ఆయన వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. ముత్యాలవారిపల్లికి చెందిన సంధ్యారాణి, గిరిష్ దంపతుల కుమారుడు నిషాంత్ (3) ఈ ఏడాది జూన్ 3వ తేదీన అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లాడు. పక్కనే ఉన్న నీటి తొట్టిలో పడి మృతి చెందాడు. దీనిపై బాలుడి తల్లి సంధ్యారాణి ఫిర్యాదు మేరకు తనకల్లు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నివేదిక మేరకు పోలీసులు విచారణ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా నిర్లక్ష్యం కారణంగానే బాలుడు మృతిచెందినట్లు తేల్చారు. దీంతో వారిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

క్రీడాకారుల ఎంపిక



ఎస్‌జీఎఫ్ జిల్లా కబడ్డీ బాలికల జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్(స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) జిల్లా కబడ్డీ, హ్యాండ్‌బాల్ క్రీడాకారులను ఎంపిక చేశారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఆర్ట్స్ కాలేజీ మైదానంలో ఎస్‌జీఎఫ్ అండర్-19 హ్యాండ్‌బాల్ బాల, బాలికల ఎంపిక పోటీలు నిర్వహించారు. అశోక్‌నగర్‌లోని డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ కబడ్డీ క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల్లో పాల్గొంటారని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు.

కబడ్డీ బాలుర జట్టు: పవన్, చరణ్, విష్ణు, మణికుమార్, రాజు, యశ్వంత్, రవీంద్ర, చరణ్‌రాజ్, హర్షవర్ధన్, హరికృష్ణ, మహేంద్ర నాయక్, రవినాయక్‌లు ఎంపికయ్యారు.

బాలికల జట్టు: హిమజ, నవ్య, సుహానా, తమన్నా, మహిమజ్యోతి, గంగోత్రి, చిన్మయి, ప్రియాంక, సాజిద, హారిక, సౌమ్య, జ్యోతి, నిఖిలప్రియ. **హ్యాండ్‌బాల్ అండర్-14:** గిరిచరణ్, మోక్షిత్‌రాజ్ నాయక్, ముఖేష్, రేవంత్‌కుమార్, గణేష్, రాహుల్, ధీరజ్‌కుమార్, యోగేంద్రనాయక్, బాలాజీనాయక్, మహేష్, భరత్, పవన్‌తేజ్, కళ్యాణ్, రమేష్, హరి ప్రీతమ్‌సింగ్, దామోదర్, వన్నారెడ్డి, దినేష్, ఉదయ్‌కిరణ్, జశ్వంత్‌నాయక్.

అండర్-17: తేజసాయిరెడ్డి, కళ్యాణ్, భరత్, హర్ష, శివానంద, పవన్, అభిరామ్, సాయిహేమంత్, విగ్నేష్, దిలీప్, తౌసీఫ్, పవన్, భరద్వాజ్, సాయికిరణ్‌నాయక్, వేణుబాబు, గౌతమ్, రోహిత్‌రాజు, కార్తీక్, ప్రశాంత్.

బాలికల విభాగం అండర్-14: గంగమ్మ, నవ్య, హర్షిత, మౌనిక, బిందు, చైత్ర, పవిత్ర, వైష్ణవి, మౌక్తిక, రమ్య, లావణ్య, వెన్నెల, మల్లిక, ఫర్హానా, లక్ష్మి, కీర్తి, కావ్య, యశోద, హిమసింధు, లాస్య ఎంపికయ్యారు.

అండర్-17: హర్షవల్లి, స్వాతి, అర్చన, తేజశ్రీ, కవిత, శైలజ, తనుశ్రీ, చైత్ర, మంజుల, హృతిక, కవిత, మౌనిక, స్వాతి, హిమబిందు, తన్మయి, భారతిభాయి, వర్షిత, లాస్య శ్రావణి చోటు దక్కించుకున్నారు.

ఆస్పత్రికి వెళితే.. ఇంటిని దోచేసిన దొంగలు

- 20 తులాల బంగారం చోరీ ?
- శింగానహళ్లిలో ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన

బొమ్మనహాళ్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో ఆస్పత్రికి వెళితే, దొంగలు ఇంటిని గుల్ల చేసిన సంఘటన మండలంలోని శింగానహళ్లి గ్రామంలో ఆలస్యంగా వెలుగు చూసింది. గ్రామానికి చెందిన చిన్న వంద్రప్పకు ఆదివారం సాయంత్రం గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు బెంగళూరుకు తరలించారు. ఆ సమయంలో చిన్న వంద్రప్ప పెద్ద అల్లుడు పరమేష్‌ను ఇంటి వద్ద ఉంచారు. అయితే పరమేష్ సోమవారం ఉదయం తన సొంత ఊరు గోవిందవాడకు వెళ్లి మరుసటిరోజు మంగళవారం మధ్యాహ్నం తిరిగి వచ్చాడు. అప్పటికే ఇంటి తలుపులు తెరిచి ఉండటంతో కేకలు వేశాడు. చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకుని పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ నబీరసూల్ తన సిబ్బందితో ఇంటిని పరిశీలించారు. డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీమ్‌లను రప్పించి ఆధారాలు సేకరించారు. ఇంట్లో దాదాపు 20 తులాల బంగారం, రూ. 20 వేల నగదు దొంగతనం జరిగి ఉంటుందని కుటుంబ సభ్యులు అనుమానిస్తున్నారు. ఆసుపత్రిలో ఉన్న వారు ఇంటికి వస్తే తప్ప చోరీ అయిన సొత్తు మొత్తం ఎంత అనేది తెలియదు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్ సంతకాల సేకరణ

మడకశిర రూరల్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలకంఠాపురం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఓట్ చోర్- గద్దె ఛోడ్ కార్యక్రమంలో భాగంగా ప్రజలతో సంతకాలు సేకరించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీడబ్ల్యూసీ సభ్యులు రఘువీరారెడ్డి, ఏపీ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్‌వలీ మాట్లాడుతూ ఓట్ల చోరీ వ్యవహారంపై రాహుల్‌గాంధీ చేస్తున్న పోరాటాన్ని ప్రజలకు వివరించారు. మాజీ ఎమ్మెల్యే సుధాకర్, కర్ణాటక మధుగిరి ఎమ్మెల్యే రాజన్న స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హరిత సీమ..





కళకళ లాడుతున్న వరి పంట

కనుచూపు మేరా కనిపిస్తున్న పైర్లను చూసి ఇది కోనసీమ అనుకుంటే పొరబాటే. కరువుకు నిలయమైన కూడేరు మండలంలోని ఇప్పేరు గ్రామ సమీపాన పరచుకున్న పచ్చదనం. నీరు లేక ఈ భూములను చాలా ఏళ్లపాటు బీళ్లుగా వదిలేశారు. హంద్రీనీవా కాలువ ద్వారా ఉమ్మడి జిల్లాలోని చాలా చెరువులను నీటితో నింపారు. ఇప్పేరు చెరువుకు మాత్రం రాలేదు. కాలువ 2.5 కిలోమీటర్ల దూరంలో ఉండడమే ఇందుకు కారణం. చెరువుకు నీరివ్వాలని ఇప్పేరుతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కోరారు. టీడీపీ హయాంలో పయ్యావుల కేశవ్ దృష్టికి తీసుకెళ్లారు. ఎన్నో అవాంతరాలు ఎదురైనా వాటన్నింటినీ అధిగమించి, కాలువ తవ్వారు. 2018లో టీడీపీ హయాంలో చెరువుకు నీరు వదిలి, పూర్తిగా నింపారు. ఇక, ఏటా నీరు వదులుతారనీ, పంటలు పండించుకోవచ్చని రైతులు ఆశించారు. ఆ తరువాత అధికారం చేపట్టిన వైసీపీ ఐదేళ్లలో ఒకేసారి అది కూడా అరకొరగా నీరిచ్చింది. అన్నదాతల ఆశలపై నీళ్లు చల్లింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో మళ్లీ ఇప్పేరు చెరువుకు నీరు చేరుతోంది. ఇప్పటికే సగానికిపైగా నిండింది. పూర్తిగా నింపనుండడంతో అన్నదాతల ఆనందానికి అవధుల్లేవు. చెరువు కింద ఇప్పేరు, అంతరగంగ గ్రామాల పరిధిలో భూగర్భ జలాలు పెరిగాయి. బోరుబావుల్లో నీటి మట్టాలు పెంపొందాయి. బావుల్లో గంగమ్మ ఉబికొచ్చింది. ఇంకేముంది ఎటు చూసినా పంటలు సాగు చేశారు. దీంతో వేల ఎకరాల్లో ఇలా పచ్చదనం పరచుకుంది.

కరువు నేలపై కృష్ణమ్మ పరవళ్లు.. హంద్రీనీవా నీటితో చెరువులకు జలకళ

- ఎండిన బోర్లు, బావుల్లో పుష్కలంగా నీరు
- పైర్లతో కళకళలాడుతున్న భూములు



ఇప్పేరు చెరువులోకి వచ్చిన హంద్రీనీవా నీరు



బావిలో ఊరిన నీరు

కూడేరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కరువుకు నిలయమైన మండలంలో కృష్ణమ్మ పరవళ్లతో చెరువులకు జలకళ వస్తోంది. బీడుబారిన భూములు పచ్చని పంటలతో కళకళలాడుతున్నాయి. వర్షాలు కురవక, పంటలు పండక అప్పులపాలైన అన్నదాతలు కరువు రక్కసితో ఏళ్లుగా విలవిలలాడారు. వందల అడుగులు బోర్లు వేసినా నీటి చుక్క దొరికేది కాదు. కొద్దోగొప్పో బోర్లలో నీరు పడినా.. వేసవిలో అడుగంటి పంటలు ఎండిపోయి అప్పుల పాలైన రైతులు కోకొల్లలు. అలాంటి పరిస్థితుల్లో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ కృషితో మండలంలోకి హంద్రీనీవా నీటిని మళ్లించారు. హంద్రీనీవా ప్రధాన కాలువ నుంచి ఇప్పేరు, ముద్దలాపురం చెరువులకు నీటిని అందించేందుకు 2018-19 సంవత్సరంలో ఉప కాలువ పనులు చేశారు. ఆ రెండు చెరువుల్లోకి నీటిని మళ్లించడంతో ఏళ్లుగా ఎండిన బోరుబావుల్లో ఒక్కసారిగా నీటిమట్టం పెరిగింది. బోరుబావుల్లో భూగర్భజలాలు సమృద్ధిగా పెరిగి.. వరి, మొక్కజొన్న, వేరుశనగ, టమోటా, బ్యాడిగ మిరప తదితర పంటలు సాగు చేస్తున్నారు.

బీడు భూమిలోనే పంటలు వేశాం



మా ఉమ్మడి కుంటుంబానికి 23 ఎకరాల భూమి ఉంది. తాతలు తవ్విన బావిలో ఒకప్పుడు నీరు పుష్కలంగా ఉండేది. కరువు పరిస్థితులు తలెత్తడంతో బావిలో నీరు ఇంకిపోయింది. పంటలను కాపాడుకోవడానికి ఎన్నిబోర్లు వేసినా నీరు పడలేదు. 15 ఏళ్లుగా భూమి బీడుగా వదిలేశాం. కుటుంబమంతా కూలి పనులు చేసుకుని, జీవనం సాగిస్తున్నాం. ఇప్పేరు చెరువుకు నీరు వదలడంతో మా పొలంలోని బోరుబావుల్లో నీరు సమృద్ధిగా పెరిగింది. వరి, మొక్కజొన్న పంటలు సాగు చేశాం.

-మహబూబ్‌బాషా, రైతు, ఇప్పేరు

బోర్లలో నీటిమట్టం పెరిగింది



నాకు 15 ఎకరాల పొలం ఉంది. బోర్లలో నీరు ఉన్న సమయంలో చీనీ సాగు చేశా. 15 ఏళ్లుగా వర్షాలు సరిగా కురవక బోర్లలో నీరు పూర్తిగా తగ్గిపోయింది. చెట్లను కాపాడుకోవడానికి నానా కష్టాలు పడ్డాం. ఇప్పేరు చెరువుకు హంద్రీనీవా నీరు రావడంతో బోర్లలో నీటిమట్టం పెరిగింది. పంటలు పండించుకుంటున్నాం.

-కొత్తపల్లి రామాంజనేయులు, రైతు, అంతరగంగ

తాగునీటికీ ఇబ్బందులు పడ్డాం



నాకు 12 ఎకరాల భూమి ఉంది. రెండు బోర్లు ఉన్నాయి. వర్షాభావంతో నీరులేక సాగు చేసిన పంటలు ఎండిపోయాయి. మా గ్రామానికి ఇప్పేరు చెరువు ఎంతో ఉపయోగం. చెరువులో నీరు ఉంటే మా బోర్లలో భూగర్భ జలాలు సమృద్ధిగా ఉంటాయి. చెరువుకు నీరు రాక ముందు తాగడానికి నీరు లేక అల్లాడిపోయాం. నీరు రావడంతో పంటలే పండించుకుంటున్నాం.

- జింకల చంద్ర, రైతు, అంతరగంగ



మొక్కజొన్న పంట

అనంతలక్ష్మిలో 175 మందికి ఉద్యోగాలు

అనంతపురం రూరల్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రాంగణ నియామకాల్లో అనంత లక్ష్మి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభచాటారు. టీవీఎస్ బ్రేక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, సాయి ఎనర్జీ, మోడ్‌ప్రో ఇంజనీరింగ్ సొల్యూషన్స్, మిత్సుబా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలు కళాశాలలో బుధవారం ప్రాంగణ నియామకాలు చేపట్టాయి. చివరి సంవత్సరం బీటెక్ విద్యార్థులు 400 మంది హాజరయ్యారు. ఆ కంపెనీల హెచ్‌ఆర్ మేనేజర్లు రాత పరీక్ష, బృంద చర్చలు, టెక్నికల్, హెచ్‌ఆర్ రౌండ్లు నిర్వహించి, 175 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. వీరందరూ ఎంపిక చేసుకున్న కంపెనీల్లో ట్రైనీ ఇంజనీర్లుగా పనిచేయనున్నారు. వార్షిక వేతనం రూ.3 లక్షలు ఇస్తామని కంపెనీ ప్రతినిధులు వెల్లడించారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ అనంతరాముడు, వైస్ చైర్మన్ రమేష్‌నాయుడు, ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, ప్రాంగణ నియామకాల అధికారి సురేంద్రనాయుడు అభినందించారు. తమ కళాశాలలో విద్యతోపాటు ఉద్యోగ సాధనపై ప్రత్యేక దృష్టి సారించామని వారు తెలిపారు. అందుకు అనుగుణంగానే విద్యార్థులు ప్రతిభ కనబరిచి ఉద్యోగాలకు అర్హత సాధించారని అన్నారు.

ఉద్యోగాలకు ఎంపికైన అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులు



అలంకరాయునిపేటను ఆదర్శంగా తీర్చిదిద్దుతా

- ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ
- పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

శింగనమల, అక్టోబరు8(ఆంధ్రజ్యోతి): మండలంలోని అలంకరాయునిపేటను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. గ్రామంలో రూ.90 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు, అండర్ డ్రైనేజీ, బస్సుషెల్టర్ తదితర పనులకు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే ఎంఎస్ రాజుతో కలిసి శ్రావణిశ్రీ భూమి పూజ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మడకశిర ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యుడు ఎంఎస్ రాజు సామాన్య వ్యక్తిలా వచ్చి స్వగ్రామమైన అలంకరాయునిపేట అభివృద్ధికి నిధులివ్వాలని కోరారన్నారు. ఆ మేరకు ఇద్దరం కలిసి, నిధులివ్వాలని ప్రభుత్వాన్ని కోరామన్నారు. అందుకు ఆమోదం తెలపడం హర్షణీయమన్నారు. మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మాట్లాడుతూ.. జన్మనిచ్చిన ఊరిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలన్నదే తన కల అనీ, అది నెరవేరే సమయం వచ్చిందన్నారు. ఇప్పటికే గ్రామాభివృద్ధికి రూ.కోటి నిధులతోపాటు బ్రిడ్జి నిర్మాణానికి అమోదం లభించిందన్నారు. వంక నీటిలోనే పాఠశాలకు వెళ్లి చదువుకున్నాననీ, అలా పిల్లలు ఇబ్బందులు పడకుండా బ్రిడ్జి నిర్మించాలని ఆశయంగా పెట్టుకున్నానన్నారు. అది సాకారం కాబోతున్నందుకు ఆనందంగా ఉందన్నారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. రోడ్ల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కోట్ల రూపాయల నిధులిస్తోందన్నారు. దీంతో వాటి రూపురేఖలు మారిపోతున్నాయన్నారు. కార్యక్రమంలో ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, శింగనమల మార్కెట్ యార్డు చైర్మన్ దండు శ్రీనివాసులు, డీసీఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేష్, టీడీపీ నేత రామలింగారెడ్డి, ఆర్డీఓ కేశవనాయుడు, నాయకులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యేలు, ఎంపీ

పెట్టుబడులు మట్టిపాలు..!

(5వ పేజీ తరువాయి)

తేటతెల్లమైంది. ఈ ఏడాది ఖరీఫ్‌లో జిల్లా వ్యాప్తంగా 2.21 లక్షల హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగు చేశారు. ఇందులో వేరుశనగ 72 వేల హెక్టార్లలో సాగైంది. ఇప్పటిదాకా 70 శాతానికిపైగా వేరుశనగ పంట కోతలు పూర్తయ్యాయి. పక్షం రోజుల్లో వందశాతం పంట కోతలు పూర్తికానున్నాయి.

ఎకరాకి 2 క్వింటాళ్లలోపే..

ఎకరాలో వేరుశనగ పంట సాగుకు రూ.30వేల నుంచి రూ.45వేలకుపైగా పెట్టుబడి పెట్టారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా దిగుబడి బాగా తగ్గింది. పంట పలు కీలక దశల్లో వర్షం పడి, పంట బాగా పండి ఉండుంటే ఎకరాకు 10 నుంచి 15 క్వింటాళ్ల దాకా దిగుబడి వస్తుంది. ఈసారి జిల్లాలోని సగానికిపైగా మండలాల్లో ఎకరాకు క్వింటా నుంచి 2 క్వింటాళ్లలోపే దిగుబడి వచ్చింది. మరికొన్ని ప్రాంతాల్లో 3 క్వింటాళ్ల దాకా వచ్చినట్లు సమాచారం. పలు ప్రాంతాల్లో చెట్టుకు నాలుగైదు కాయలే ఉన్నాయి. కాయలున్న చోట అవుటన్ లేకపోవడంతో దిగుబడి భారీగా తగ్గింది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో క్వింటా వేరుశనగ రూ.4700 నుంచి రూ.5వేలదాకా పలుకుతోంది. ఈ పరిస్థితుల్లో రైతులకు కూలి ఖర్చులకు కూడా దక్కట్లేదు. ఈసారి దిగుబడులు పూర్తిగా తగ్గిపోవడంతో రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టిన రైతులు మరింత అప్పులపాలయ్యారు.

పంట కోత ప్రయోగాల్లోనూ తేటతెల్లం..

జిల్లావ్యాప్తంగా పంట కోత ప్రయోగాలు చేసేందుకు 148 గ్రామాలను ఎంపిక చేశారు. ఒక్కో గ్రామంలో 2 చొప్పున 296 పంట కోత ప్రయోగాలు చేయాలని లక్ష్యాన్ని విధించారు. అందుకు 148 మంది ఎన్యూమరేటర్లను నియమించారు. స్థానిక వ్యవసాయ శాఖ ఏడీలు, ఏఓలు, ప్రణాళిక శాఖ అధికారులు పంట కోత ప్రయోగాలను పర్యవేక్షించేలా నిర్ణయం తీసుకున్నారు. గత ఐదు రోజుల నుంచి జిల్లాలో పంట కోత ప్రయోగాలు చేస్తున్నారు. ఇప్పటిదాకా 20 మేర పంట కోత ప్రయోగాలు పూర్తయ్యాయి. ఇందులో అత్యల్పంగా కంబదూరు మండలంలో ఎకరాకు క్వింటా దిగుబడి వచ్చింది. శెట్టూరులో 2 క్వింటాళ్లు, వజ్రకరూరు మండలం చాబాల వద్ద ఎకరాకు 3 క్వింటాళ్లు వచ్చింది. మిగిలిన ప్రాంతాల్లోనూ ఎకరాకు 2 క్వింటాళ్లలోపు దిగుబడి వచ్చినట్లు తెలిసింది.

కీలక దశల్లో వెంటాడిన వర్షాభావం

ఈ ఏడాది ఖరీఫ్‌లో అరకొర వర్షాలకే వేరుశనగ సాగు చేశారు. పంట కీలక సమయం పూత, ఊడలు, పిందెలు ఊరే సమయాల్లో వర్షం రాకపోవడంతో వేరుశనగ పంట దిగుబడి పూర్తిగా తగ్గింది. పంట కీలక దశల్లో వర్షం కురవకపోవడంతో నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు ప్రాంతాల్లో వేరుశనగ పంట పైకి చూసేందుకు పచ్చగా ఉన్నా.. దిగుబడులు అంతంత మాత్రంగానే వచ్చింది. ఈ ఏడాది జూలై, సెప్టెంబరు నెలల్లో పంటల కీలక సమయాల్లో వేరుశనగ పంట ఊడలు దిగే సమయం, పిందె ఊరే దశల్లో వర్షం పడలేదు. పంట కీలక దశల్లో వర్షాభావం వెంటాడడంతో భూమిలోకి ఊడలు సరిగా దిగలేదు. ఆ తర్వాత పిందె ఊరే దశలోనూ వర్షంలేక భూమిలో తేమలేకపోవడంతో పిందెలు ఊరలేదు. ఈ పరిస్థితుల్లో ఈసారి వేరుశనగ దిగుబడి భారీగా తగ్గింది. కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని బ్రహ్మసముద్రం తదితర ప్రాంతాల్లో వర్షాభావంతో వేరుశనగ పంట దిగుబడి రాక ఎండిపోయింది. దీంతో కోతకు ముందే పంటను దున్నేశారు. జూన్ నెల సాధారణ వర్షపాతం 61.2 మి.మీ, కాగా.. ఈ ఏడాది 47.9 మి.మీ నమోదైంది. జూలై సాధారణ వర్షపాతం 64.3 మి.మీలకుగాను 34.7 మి.మీ. పడింది. ఆగస్టు సాధారణ వర్షపాతం 84.4 మి.మీ.కుగాను 165.9 మి.మీ. వర్షపాతం నమోదైంది. సెప్టెంబరు సాధారణ వర్షపాతం 111.6 మి.మీ. కాగా 87.0 మి.మీ. నమోదైంది.



గుత్తి రూరల్ మండలం ఊబిచెర్లలో దిగుబడి లేని వేరుశనగ పంట

పెట్టుబడి ఖర్చులు కూడా రావు



ఈసారి వేరుశనగ దిగుబడి తగ్గింది. 4 ఎకరాల్లో పంట సాగు చేశా. ఎకరాకు రూ.40వేలు పెట్టుబడి పెట్టా. ఎకరాకు 2 క్వింటాళ్లలోపు దిగుబడి వస్తోంది. గతేడాదిలాగే ఈసారి వర్షాలు సరిగా కురవకపోవడంతో దిగుబడి తగ్గింది. ఈ సారి పెట్టుబడి ఖర్చులు కూడా రాలేదు. అప్పు చేసి పంట సాగు చేశా. చేసిన అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదు.

- రామచంద్ర, ఊబిచెర్ల, గుత్తి రూరల్ మండలం

ఈ సారి దిగుబడి తగ్గింది..



ఈ ఏడాది ఖరీఫ్‌లో వేరుశనగ పంట కీలక దశల్లో వానలు పడలేదు. దీంతో దిగుబడి భారీగా తగ్గింది. ఎక్కువ శాతం ప్రాంతాల్లో ఎకరాకు క్వింటా నుంచి 2 క్వింటాలోపే దిగుబడి వచ్చింది. వర్షాధారం కింద వేరుశనగ పంట సాగు చేసిన రైతులకు ఈ సారి నష్టం వాటిల్లింది. పంటకు పడాల్సిన సమయంలో వానలు పడకపోవడంతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో వేరుశనగ ఎండిపోవడంతో కోతకు ముందే దున్నేశారు. మరికొన్ని ప్రాంతాల్లో పైకి పంట పచ్చగా కనిపించినా.. కాయలు అవుటన్‌లేక దిగుబడి భారీగా తగ్గింది. -చంద్రాయుడు, కేవీకే ప్రధాన శాస్త్రవేత్త, కళ్యాణదుర్గం

చీనీ టన్ను రూ.15వేలు



అనంతపురం రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్లో బుధవారం సీజనల్ చీనీ కాయలు టన్ను గరిష్ఠంగా రూ.15వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఇన్‌చార్జి కార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.8వేలు, సరాసరిగా రూ.12వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 100టన్నుల చీనీ కాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

రోడ్లకు మహర్దశ

- మరమ్మతులకు ప్రభుత్వం చర్యలు
- ఉమ్మడి జిల్లాలో పెద్దఎత్తున పనులకు గ్రీన్‌సిగ్నల్

పుట్టపర్తిరూరల్/అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలో రోడ్లను గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. మరమ్మతులు కూడా చేయలేదు. దీంతో రోడ్లలో గుంతలు పడి అవి గోతుల్లా మారాయి. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక పెద్దఎత్తున రోడ్ల నిర్మాణాలు చేపట్టింది. తాజాగా మరమ్మతులు చేపట్టాలని నిర్ణయించింది. ఆ దిశగా రోడ్ల మరమ్మతులకు ఆమోదం తెలపడంతో గుంతల బాధలు తప్పనున్నాయి. అందులో భాగంగా ఉమ్మడి జిల్లాలో కోట్ల రూపాయల విలువైన పనులకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీంతో గ్రామాలు, పట్టణాల మధ్య రవాణా సదుపాయాలు మెరుగు పడనున్నాయి.



శ్రీసత్యసాయి జిల్లాలో చేపట్టనున్న పనులు

- హిందూపురం-కొడికొండ మధ్య 420వ నంబరు రహదారిలో 4.27 కి.మీ, పనులకు రూ.1.6 కోట్లు
- కదిరి-హిందూపురం రహదారిలో 5.46 కి.మీ పనులకు రూ.3.6 కోట్లు జమ్మలమడుగు-కదిరి రహదారి ఎస్‌హెచ్ 448లో 7.42 కి.మీ పనులకు రూ.3 కోట్లు
- కోడూరు-ధర్మవరం ఎస్‌హెచ్ 064లో 3 కి.మీ పనులకు రూ.1.5 కోట్లు
- హిందూపురం-సోమందేపల్లి ఎస్‌హెచ్ 464లో 0.65 కి.మీ పనులకు రూ.60లక్షలు
- పరిగి-శ్రీరంగరాజుపల్లి, పెనుకొండ-పావగడ రహదారుల్లో 21 కి.మీ పనులకు రూ.7.50 కోట్లు
- మాల్యవంతం-పార్నపల్లి, పోట్లమర్రి ఏకేఆర్ రోడ్, చిల్లకొండయ్యపల్లి-రామాపురం పరిధిలో 14 కి.మీ పనులకు రూ.5.30కోట్లు
- పుట్టపర్తి రింగ్‌రోడ్డు 2.40 కి.మీ పనులకు రూ.2.50 కోట్లు
- పుట్టపర్తి డైవర్షన్ రోడ్డు 4.90 కి.మీ పనులకు రూ.3.40 కోట్లు
- రెక్కమాను-వెలిచెలమల రోడ్డు 9.50 కి.మీ పనులకు రూ.3 కోట్లు
- హిందూపురం బైపాస్ రోడ్డు 3.80 కి.మీ పనులకు రూ.2.70 కోట్లు
- జమ్మలబండ-మేకలగట్టు వయా రామాయణహట్టి జీఎస్ తండా రూ.2.60 కోట్లు

అనంతపురం జిల్లాలో..

- కంబదూరు-కళ్యాణదుర్గం నూతిమడుగు ప్రధాన రోడ్డు రాంపురం జంక్షన్ వరకు 4.4 కిలోమీటర్లకు రూ.3 కోట్లు
- కళ్యాణదుర్గం నుంచి నాగేపల్లి గేట్ వరకు కుందుర్పి మీదుగా 12.2 కిలోమీటర్లకు రూ.4 కోట్లు
- రాయదుర్గం-కణేకల్లు రోడ్డులో 3.3 కిలోమీటర్లకు రూ.1.8 కోట్లు
- బళ్లారి, గుండ్లపల్లి మధ్యలో 13 కిలోమీటర్లకు రూ.6 కోట్లు
- అనంతపురం-బళ్లారి రోడ్డు కౌకుంట్ల వరకు జల్లిపల్లి మీదుగా పీఏబీఆర్ డ్యాం వరకు 4.5 కిలోమీటర్లకు రూ.10.6 కోట్లు
- గార్లదిన్నె-పెనకచర్ల రోడ్డు 16 కిలోమీటర్లకు రూ.4.5 కోట్లు పామిడి-గుంతకల్లు, గుత్తి-కసాపురం రోడ్లలో 18 కిలోమీటర్లకు రూ.5.3 కోట్లు
- కోనవారిపల్లి-వెంగనూరు రోడ్డుతోపాటు అనంతపురం-తాడిపత్రి రహదారి నుంచి బోగసముద్రం రోడ్డులో 7.2 కిలోమీటర్లకు రూ.2.8 కోట్లు
- నిట్టూరు-మిడుతూరు రోడ్డుకు 12.6 కిలోమీటర్లతో రూ.3.4 కోట్లు అనంతపురం బైపాస్‌రోడ్డు నుంచి కనగానపల్లి రోడ్డుతోపాటు చిగిచెర్ల మీదుగా అనంతపురం-ధర్మవరం రోడ్డులో 12.6 కిలోమీటర్లకు రూ.5 కోట్లు

గడ్డి మందుతో పండ్లతోటలకు దెబ్బ

ఉద్యాన శాఖ జేడీ దేవమునిరెడ్డి, శాస్త్రవేత్త శ్రీనివాస్‌రెడ్డి

గార్లదిన్నె/శింగనమల, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిషేధించిన మందులను పిచికారీ చేస్తే పండ్లతోటలు దెబ్బతింటాయని ఉద్యాన శాఖ జాయింట్ డైరెక్టర్ దేవమునిరెడ్డి, నిమ్మ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త శ్రీనివాస్‌రెడ్డి రైతులకు సూచించారు. మండలంలోని మర్తాడు, యర్రగుంట్ల, గార్లదిన్నె గ్రామాల్లో బుధవారం వారు చీనీ తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా చీనీ సాగులో ఎదుర్కొంటున్న సమస్యలను రైతులను అడిగి తెలుసుకున్నారు. నల్లి తెగులు ఎక్కువగా సోకుతుండటంతో చీనీ చెట్లు చనిపోతున్నాయని పలువురు రైతులు వారికి తెలిపారు. అనంతరం రైతు సేవాకేంద్రంలో రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రభుత్వం నిషేధించిన గ్లైసిల్ (గడ్డి మందు)ను పండ్లతోటల్లో పిచికారీ చేయడం వల్ల పండ్లతోటలు దెబ్బతినడం, మనుషులు క్యాన్సర్ బారినపడే ప్రమాదం ఉందన్నారు. అందుకే రైతులు ఆ మందును పిచికారి చేయరాదని సూచించారు. ప్రత్యామ్నాయంగా కలుపు నివారణ షీట్లను వినియోగించాలని తెలియజేశారు. నల్లి నివారణకు ఇథియాన్, డైకోఫాల్ వంటి మందులను వినియోగించాలన్నారు. వేరుకుళ్లు తెగుళ్ల సోకకుండా రంగాపూర్ వేరు మూలం అంట్లను నాటుకోవాలన్నారు. చీనీసాగులో మేలైన యాజమాన్య, నూతన సాంకేతిక పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు వస్తాయన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఉమాదేవి, ఉద్యానశాఖ అధికారి రత్నకుమార్, ఉద్యాన విస్తరణ అధికారి రామాంజనేయులు, శింగనమల ఉద్యానశాఖ అధికారి శైలజ రైతులు పాల్గొన్నారు.



చీనీ రైతుల సమస్యలు తెలుసుకుంటున్న జేడీ, శాస్త్రవేత్తలు

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య



అశ్విని (ఫైల్)

చెన్నేకొత్తపల్లి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): కళాశాలకు వెళ్లి చదువుకోవడం ఇష్టంలేని ఓ ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని ప్యాదిండి గ్రామంలో బుధవారం జరిగింది. ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన మేరకు...ప్యాదిండి గ్రామానికి చెందిన గంగాధర్, పార్వతి దంపతుల కుమార్తె అశ్విని(15) రామగిరి కేజీబీవీలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతుండేది. దసరా సెలవులకు ఇంటికి వచ్చిన ఆమె, తిరిగి కళాశాలకు వెళ్లడానికి మంగళవారం రాత్రి బ్యాగు సర్దుకుంది. ఈక్రమంలో కళాశాలకు వెళ్లడానికి బుధవారం తెల్లవారుజామున తల్లి నిద్రలేపింది. ఏర్పాట్లు చేసుకునే క్రమంలో ఇంటిలో నుంచి అశ్విని బయటకు వెళ్లింది. కళాశాలకు వెళ్లడం, చదువుకోవడం ఇష్టంలేదనే విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పుకోలేక ఇంటి పక్కనే ఉన్న పశువుల పాకలోకి వెళ్లి ఉరివేసుకుంది. బయటకు వెళ్లిన అశ్విని ఎంతసేపటికి తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు గాలించగా పశువుల పాకలో ఉరికి వేళాడుతూ కనిపించింది. వెంటనే కుటుంబసభ్యులు అశ్వినిని కిందకు దించి ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

లారీ ఢీకొని వృద్ధురాలి మృతి



మెహబూబ్‌బీ(ఫైల్)

పుట్టపర్తిరూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగళమ్మచెరువులో లారీ ఢీకొని వృద్ధురాలు మెహబూబ్‌బీ (62) బుధవారం మృతి చెందారు. పోలీసులు తెలిపిన మేరకు మృతురాలు బహిర్భూమికి వెళ్తుండగా హైస్కూల్ వైపు నుంచి రివర్స్‌లో వచ్చిన లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. డ్రైవర్ అజాగ్రత్తగా లారీని నడపడంతోనే ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించినట్లు రూరల్ ఎస్సై లింగన్న తెలిపారు. కాగా ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ పరారైనట్లు తెలిపారు.

పిడుగుపాటుకు రైతు..



గోవిందప్ప (ఫైల్)

కణేకల్లు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గరుడచేడు గ్రామానికి చెందిన రైతు గోవిందప్ప(59) పిడుగుపాటుకు మృతిచెందారు. ఎద్దును మేపేందుకు బుధవారం సాయంత్రం గోవిందప్ప గ్రామ శివారు ప్రాంతానికి వెళ్లాడు. ఆ సమయంలో ఆకాశం మేఘావృతమై పిడుగు పడింది. దీంతో ఎద్దుతోపాటు గోవిందప్ప మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో అక్కడక్కడ బుధవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో చిరు జల్లులు పడ్డాయి.

కాలువలో దూకిన వ్యక్తి..



షరీఫ్ (ఫైల్)

బొమ్మనహాళ్, అక్టోబరు 8, (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవగిరిక్రాస్ హెచ్చెల్సీ డిస్ట్రిబ్యూటరీలో బుధవారం ఓ మృతదేహం కనిపించింది. బొమ్మనహాళ్, హొస్పేట్ పోలీసులు తెలిపిన మేరకు కర్ణాటకలోని హొస్పేట్‌కు చెందిన జమీర్‌హల్లీషరీఫ్ (43) గత కొంతకాలంగా ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడేవాడు. ఈనేపథ్యంలో 'మానసికంగా చాలా కుంగిపోయాను. హెచ్చెల్సీలోకి దూకి ఆత్మహత్య చేసుకుంటున్నా. హొస్పేట్ పోలీసులకు సమాచారం ఇవ్వండి' అని మంగళవారం బళ్లారి సమీపంలోని అల్లిపురం వద్ద సెల్ఫీ వీడియో తీసుకుని కుటుంబ సభ్యులకు పంపాడు. అనంతరం కాలువలో దూకాడు. వీడియో చూసి కుటుంబసభ్యులు ఆందోళనతో స్థానిక పోలీసులను ఆశ్రయించారు. అయితే బుధవారం డిస్ట్రిబ్యూటరీ కాలువలో జమీర్‌హల్లీషరీఫ్ కనిపించడంతో స్థానికులు బొమ్మనహాళ్ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు పరిశీలించి, హొస్పేట్ పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం బళ్లారి విమ్స్‌కు తరలించారు. ఈ ఘటనపై హొస్పేట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మహిళ మెడలో గొలుసు చోరీ



రోదిస్తున్న జమున

ధర్మవరం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): అనంతపురం నుంచి ధర్మవరం వస్తున్న ఆర్టీసీ బస్సులో ఓ మహిళ మెడలో నుంచి ముదున్నర తులాల బంగారు గొలుసును గుర్తుతెలియని దొంగ అపహరించారు. బాధితురాలు జమున తెలిపిన మేరకు... చెన్నేకొత్తపల్లి మండలం గంగినేపల్లి తండాకు చెందిన రవినాయక్ భార్య జమున బుధవారం ఉదయం తన కుమార్తెను కళాశాలకు వదిలిపెట్టేందుకు అనంతపురం వెళ్లారు. అక్కడి నుంచి స్వగ్రామం వెళ్లేందుకు ధర్మవరం ఆర్టీసీ బస్సు ఎక్కింది. తలనొప్పిగా ఉందని మాత్ర వేసుకుని బస్సులో నిద్రపోయింది. అయితే బస్సు ధర్మవరం బస్టాండ్‌కు రాగానే మెడలో చైను కనిపించలేదు. దీంతో ఆమె తన చైనును ఎవరో దొంగిలించారని ఆర్టీసీ అధికారులకు తెలిపారు. వెంటనే వారు స్థానిక వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు బస్టాండ్‌కు చేరుకుని ఆమెతో వివరాలు ఆరా తీశారు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

సీజేఐపై దాడి.. రాజ్యాంగంపై దాడే

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్



మాట్లాడుతున్న రాంభూపాల్

అనంతపురం టౌన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై దాడి రాజ్యాంగంపై చేసిన దాడి అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ పేర్కొన్నారు. దాడిని ఖండిస్తూ బుధవారం స్థానిక గణేనాయక్ భవన్‌లో నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. సనాతన ధర్మానికి అవమానం జరిగిందన్న పేరుతో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై న్యాయవాది కోర్టులో అందరూ చూస్తుండగానే దాడికి యత్నించడం దేశంలో పరిస్థితికి అద్దం పడుతోందన్నారు. మోదీ పాలనలో అన్ని వ్యవస్థలను ధ్వంసం చేస్తున్నారన్నారు. సనాతన ధర్మ పరిరక్షణ పేరుతో సీజేఐపైనే దాడికి యత్నించడం రాజ్యాంగానికి, దేశ ప్రజలకు అవమానకరమని పేర్కొన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా ప్రభుత్వాలు చొరవ చూపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బాలరంగయ్య, నాగేంద్రకుమార్, రామిరెడ్డి, చంద్రశేఖర్, సావిత్రి, కృష్ణమూర్తి, శ్రీనివాసులు, జిల్లా కమిటీ సభ్యులు పరమేష్, ఆర్వీ నాయుడు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత ఆధార్ సేవలు

తపాలాశాఖ సూపరింటెండెంట్ అమర్‌నాథ్

అనంతపురం ప్రెస్‌క్లబ్, అక్టోబరు8(ఆంధ్రజ్యోతి): జాతీయ తపాలా వారోత్సవాల్లో భాగంగా ఆ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత ఆధార్ శిబిరాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా బుధవారం తొలి రోజు నగరంలోని కొవ్వూరునగర్‌లోని విశ్వభారతి పాఠశాలలో నిర్వహించిన ఉచిత ఆధార్ శిబిరంలో 60 మంది విద్యార్థులు సేవలు వినియోగించుకున్నారు. ఈ ఉచిత సేవలు ఈ నెల 14 వరకూ కొనసాగుతాయని తపాలాశాఖ సూపరింటెండెంట్ అమర్‌నాథ్ తెలిపారు. 10, 11 తేదీల్లో కళ్యాణదుర్గం రోడ్డులోని నవభారత్ పాఠశాల, 13, 14 తేదీల్లో పాపంపేటలోని భాగ్యనగర్ ఎస్ఎఫ్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలల్లో ఆధార్ సేవలు కొనసాగుతాయన్నారు.

కళ్లు మూసుకుని చేసేశారు..!

(5వ పేజీ తరువాయి)

చేశారు. డబుల్ రిజిస్ట్రేషన్ తరువాత ముకుందనాయుడు ఆ స్థలంలో తమ పేరిట బోర్డు పాతి, అందులో సెల్ నంబరు వేశారు. ఈ విషయం ఆగస్టు నెలలో కవలూరు కృష్ణ కుటుంబ సభ్యులకు తెలిసింది. వారు స్థలం వద్దకు వెళ్లి పరిశీలించారు. బోర్డులో రాసిన నంబరుకు ఫోన్ చేస్తే స్పందించలేదు. దీంతో అవస్థలు పడి ఆ వ్యక్తులకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలు సంపాదించారు.



కృష్ణ భార్య అనసూయ

సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు ఫిర్యాదు..

తమ భూమిలో బోర్డు పాతినవారు టీడీపీ నాయకులని తెలుసుకున్న కవలూరు కృష్ణ, ఆయన భార్య అనసూయ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌కు ఒరిజినల్ రిజిస్ట్రేషన్ పత్రాలతో మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశారు. అనంతపురం జిల్లా కలెక్టర్‌కు, పోలీసు ఉన్నాతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈలోగా భూవివాదం గురించి విచారించాలని సీఎం పేషీ నుంచి కలెక్టర్‌కు ఆదేశాలు అందాయి. దీంతో రెవెన్యూ డివిజనల్ స్థాయి అధికారి విచారణ చేపట్టారు. ఆ భూమిని సర్వే చేశారు. రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. భూమి కొలతలు వేసే సమయంలో పద్మగీత, ఆమె భర్త ముకుందనాయుడు అక్కడకు రాలేదని రెవెన్యూ అధికారులు తెలిపారు. 2009 నుంచి కవలూరు కృష్ణనే భూ హక్కుదారుగా ఉన్నారని రెవెన్యూ అధికారులు నిర్ణయించారు. ఈ సమాచానాన్ని రిజిస్ట్రేషన్ శాఖ అధికారులకు తెలియజేశారు. ఆ సర్వే నంబరుపై ఎలాంటి క్రయ, విక్రయాలు జరగకుండా రెవెన్యూ వెబ్‌ల్యాండ్‌లో రీఓక్‌లో పెట్టారు. ఈ వివాదంపై రెవెన్యూ అధికారులు మూడు రోజుల క్రితం జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక అందించినట్లు తెలిసింది.

మా భూమి మాకు దక్కేలా చూడండి

ఎన్నో ఏండ్లు కష్టపడి కొనుగోలు చేసిన తమ భూమిని రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు మరొకరికి రిజిస్ట్రేషన్ చేయించారని కవలూరు కృష్ణ భార్య అనసూయ ఆవేదన వ్యక్తం చేశారు. పూర్తి స్థాయిలో రికార్డులు పరిశీలించి, తమ భూమి తమకు దక్కేలా చూడాలని మూడు రోజుల క్రితం అనంతపురం తహసీల్దార్ హరికుమార్‌ను కలిసి విన్నవించారు.

ఉన్నతాధికారులకు నివేదించాం




కె. కృష్ణ అనే వ్యక్తి ఎ.నారాయణపురం గ్రామ సర్వే నంబరు 156-2లోని ఎకరం భూమికి సర్వేకు ఇటీవల దరఖాస్తు చేసుకున్నారు. మండల సర్వేయర్ ఆధ్వర్యంలో సర్వే చేశాం. ఇదే భూమికి పద్మగీత వైఫ్ ఆఫ్ ముకుందనాయుడు పేరుమీదుగా రిజిస్టర్డ్ డాక్యుమెంట్ ఉంది. కానీ రెవెన్యూ రికార్డుల ప్రకారం 2009 నుంచి కె. కృష్ణ సన్నాఫ్ దత్తాత్రేయ గౌడ్ పేరిట ఆ భూమి ఉంది. రెవెన్యూ రికార్డులు, సర్వే రిపోర్టును జిల్లా ఉన్నతాధికారులకు నివేదించాం.

-హరికుమార్, తహసీల్దార్, అనంతపురం అర్బన్

ఉలిగప్పను ఉలిగమ్మగా మార్చారు..!

రూ.18 లక్షల పరిహారం కాజేశారు

న్యాయం చేయాలని బాధితుల వినతి



అడంగల్‌లో ఉలిగప్ప పేరును ఇలా ఉలిగమ్మగా మార్చారు

విడపనకల్లు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి విస్తరణలో పోయిన స్థలం, ఇంటికి వచ్చే పరిహారాన్ని పేరు మార్చుకుని కాజేశారు. దీంతో విడపనకల్లు మండలం గడేకల్లుకు చెందిన బాధితులు ఆరేళ్ల నుంచి న్యాయం కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. గ్రామానికి చెందిన ఉలిగప్పకు సర్వే నంబరు 610-2 లో 0.9 సెంట్లు స్థలం ఉండేది. అందులో 0.6 సెంట్ల స్థలం, ఓ ఇంటిని 2016లో జరిగిన 67వ జాతీయ రహదారి విస్తరణలో కోల్పోయాడు. వీటికి రూ.18 లక్షల పరిహారం మంజూరైంది. కానీ బాధితుడికి ఆ మొత్తం అందలేదు. ఉలిగప్ప కుటుంబ సభ్యులు అధికారులను విచారిస్తే, ఆ స్థలం ఉలిగమ్మ పేరిట ఉందని చెప్పారు. ఆమెకే పరిహారం అందుతుందని సెలవిచ్చారు. రికార్డుల్లో స్పష్టంగా ఉలిగప్ప పేరు ఉందని, అయినా స్థలంతో సంబంధం లేని మహిళకు పరిహారం ఇచ్చారని ఉలిగప్ప కోడలు రామాంజినమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి, కొందరు రెవెన్యూ అధికారులు కలిసి మోసానికి పాల్పడ్డారని ఆరోపించారు. అడంగల్‌లో ఉలిగప్ప పేరును ఉలిగమ్మగా మార్పించి, పరిహారాన్ని కాజేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు తమకు న్యాయం చేయాలని విన్నవించారు. ఈ వివాదం తమ దృష్టికి రాలేదని డిప్యూటీ తహసీల్దారు చంద్రశేఖర్ రావు అన్నారు. బాధితులు ఫిర్యాదు చేస్తే పరిశీలించి న్యాయం చేస్తామని అన్నారు.

కొత్త టీచర్లకు వెబ్ కౌన్సెలింగ్..?

నేడు ఆప్షన్లు.. రేపు ఆర్డర్లు..!

కమిషనర్ కాన్ఫరెన్స్‌లో స్పష్టత వచ్చే అవకాశం

అనంతపురం విద్య, అక్టోబరు8(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ 2025లో నియమితులైన కొత్తటీచర్లకు స్థానాల కేటాయింపునకు వెబ్ కౌన్సిలింగ్‌కే విద్యాశాఖ మొగ్గుచూపినట్లు తెలుస్తోంది. నాలుగు రోజుల క్రితం మ్యానువల్ కౌన్సెలింగ్ ఉంటుందనీ, అందుకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర విద్యాశాఖ అధికారులు సూచించారు. ఆ మేరకు ఇక్కడ అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. మ్యానువల్ కౌన్సెలింగ్ అనగానే తమ వారికి 'ఫలానా ప్లేస్ పెట్టి.. ఇప్పించండి' అంటూ జిల్లాతోపాటు రాష్ట్ర స్థాయిలో ఒత్తిళ్లు వచ్చాయట. దీంతో రాష్ట్ర విద్యాశాఖ అధికారులు మ్యానువల్‌కు వెనకడుగు వేసినట్లు తెలుస్తోంది. మళ్లీ వెబ్ కౌన్సెలింగ్‌కే మొగ్గు చూపినట్లు చర్చ సాగుతోంది. దీంతో కొత్త టీచర్లకు వెబ్ కౌన్సెలింగ్ దాదాపు ఖాయమైనట్లు విద్యాశాఖ అధికారవర్గాల ద్వారా తెలుస్తోంది. శిక్షణ పొందుతున్న సెంటర్లలోనే కొత్త టీచర్లు గురువారం వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవాల్సి ఉంటుందనీ, చివరి రోజైన శుక్రవారం ఆర్డర్లు ఇచ్చి పంపనున్నట్లు సమాచారం. కొత్తటీచర్లు వెబ్‌ఆప్షన్లు పెట్టుకోవడంపై ముందుగానే శిక్షణ కేంద్రాలకు విద్యాశాఖ అధికారులు, సిబ్బంది చేరుకుని, అవగాహన కల్పిస్తారట. దీనిపై బుధవారం రాత్రి కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసి, కమిషనర్ క్లారిటీ ఇచ్చి, నిబంధనలు వెల్లడించాల్సి ఉంది. కాన్ఫరెన్స్ గురువారం ఉదయానికి వాయిదా పడడంతో సస్పెన్స్ కొనసాగుతోంది. డీఈఓ ప్రసాద్‌బాబు దీనిపై స్పందిస్తూ.. కమిషనర్ కాన్ఫరెన్స్‌లో వెబ్ కౌన్సెలింగ్‌పై క్లారిటీ వచ్చే అవకాశం ఉందన్నారు. కొత్త గురువులు.. వెబ్ ఆప్షన్లపై టెన్షన్ పడుతున్నారు.

748 ఖాళీలు ఫ్రీజ్

జిల్లాలో 748 ఖాళీలను గుర్తించి, వాటిని రాష్ట్రశాఖకు పంపగా అక్కడ ఫ్రీజ్ చేశారు. మొత్తం 751 మంది కొత్తటీచర్లకుగాను ముగ్గురు నాట్ విల్లింగ్ ఇచ్చారు. మిగిలిన 948 మందికిగాను ఒక్కొక్కరికి ఆయా సబ్జెక్టులలో ఒక పోస్టు చొప్పునే ఖాళీలు చూపిస్తున్నారు. ఇందులో ఇప్పటి వరకు ఒక టీచర్‌లేని స్కూళ్లకు తొలి ప్రాధాన్యత ఇచ్చారు. ఇటీవల బదిలీ అయినా రిలీవర్‌లేక టీచర్లు అక్కడే ఉన్న స్కూళ్లకు, 50శాతం కన్నా తక్కువ టీచర్లు ఉన్న వాటికి ప్రాధాన్యత ఇచ్చామని విద్యాశాఖ చెబుతోంది. ఈ లెక్కన జిల్లా కేంద్రానికి దూరమండలాల్లోనే ఖాళీలు అధికంగా ఉండనున్నాయి. దీనిపై కొత్తటీచర్లు ఆందోళన చెందుతున్నారు.

నిశ్శబ్దం..!

ఐసీడీఎస్ పీడీ సస్పెన్షన్‌తో ఉలిక్కిపడ్డ ఉద్యోగవర్గాలు

కార్యాలయంలో కనిపించని మునుపటి సందడి

శిశుగృహంలో అక్రమాలపై ప్రభుత్వానికి నివేదిక

అనంతపురం వైద్యం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): నగరంలోని శిశుగృహలో ఇటీవల ఓ చిన్నారి మరణించడంతో మాతా, శిశు సంక్షేమ శాఖలో అలజడి నెలకొంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో మాతా, శిశు సంక్షేమ శాఖ మంత్రి, ప్రభుత్వ కార్యదర్శి, డైరెక్టర్ నుంచి, జిల్లా యంత్రాంగం వరకు ఆశాఖపై ప్రత్యేక దృష్టి సారించారు. చిన్నారి మృతిపై లోతైన విచారణ చేయించి, నిజాలను నిగ్గు తేల్చేపనిలో అధికారులు తలమునకలయ్యారు. ఈ క్రమంలోనే ఐసీడీఎస్ పీడీ ఎం.నాగమణిని సస్పెండ్ చేశారు. దీంతో ఆశాఖకు సంబంధించిన ఉద్యోగ వర్గాలు ఉలిక్కిపడ్డాయి. నిత్యం సందడిగా ఉండే జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయంలో బుధవారం నిశ్శబ్దం నెలకొంది. ఈక్రమంలో ఇన్‌చార్జ్ బాధ్యతలు ఎవరికి అప్పగించాలన్న తర్జన భర్జనలో జిల్లా ఉన్నతాధికార యంత్రాంగం ఉన్నట్లు సమాచారం. కాగా చిన్నారి మరణం విషయాన్ని జిల్లా కలెక్టర్, సంబంధిత రాష్ట్ర శాఖ అధికారికి తెలియజేయాల్సి ఉండగా, తెలియజేయకుండా, తొక్కి పెట్టడానికి రెండు రోజులు ఐసీడీఎస్ కార్యాలయంలో గుట్టుగా విచారణ చేయడాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. పత్రికలు, వివిధ ప్రచార సాధనాల్లో చిన్నారి మృతి వార్త గురించి రావడంతో ప్రభుత్వం క్రమశిక్షణ చర్యలకు పూనుకుంది. ఈక్రమంలోనే పీడీపై సస్పెన్షన్ వేటు వేసింది.

వివాదాలకు అడ్డా...

శిశుగృహ కేంద్రం నిత్యం వివాదాలకు కేంద్రంగా మారింది. దీంతో గతంలో పదుల సంఖ్యలో సంరక్షణ పొందుతున్న శిశువుల సంఖ్య నేడు బాగా తగ్గిపోయింది. సంరక్షణ పొందుతున్న శిశువులనే ఆర్థిక వనరుగా మార్చుకుని సిబ్బంది అనేక అక్రమాలకు పాల్పడినట్లు అనేక ఆరోపణలు ఉన్నాయి. వీటి నుంచి తప్పించుకునేందుకు జిల్లా కలెక్టర్, ప్రభుత్వాన్ని బురిడీ కొట్టించే యత్నాలు ఎప్పటిప్పుడు చేస్తుంటారనే విమర్శలు ఉన్నాయి. తాజా ఘటనతో గతంలోని అక్రమాలు సైతం వెలుగులోకి వస్తున్నాయని చర్చసాగుతోంది. వీటిపై విచారణ చేపడితే నిజాలు నిగ్గుతేలే అవకాశాలున్నాయని పేర్కొంటున్నాయి.

అక్రమాలపై ప్రభుత్వానికి నివేదిక

చిన్నారి మృతితో శిశుగృహ కేంద్రంలో జరుగుతున్న అక్రమాలు వెలుగులో వచ్చాయి. శిశుగృహ కేంద్రం ఏర్పాటు చేసినప్పటి నుంచి ఎంతమంది శిశువులను సంరక్షించారు? ఎంతమందిని దత్తత ఇచ్చారు? ఈ ప్రక్రియలో నెలకొన్న సంఘటనలు, జరిగిన అక్రమాలు తదితర వివరాల నివేదిక రాష్ట్ర ప్రభుత్వానికి చేరినట్లు సమాచారం. కేంద్రంలోని శిశువుల తారుమారు, విదేశీయుల విరాళాలు, దత్తత తీసుకున్న వారి ఆర్థిక సహాయ, సహకారాల అంశాలను క్షుణ్ణంగా నివేదించినట్లు తెలిసింది. శిశుగృహలో ఎంతమంది ఉద్యోగులున్నారు? ఏ ప్రాతిపదికన పనిచేస్తున్నారు? జీత, భత్యాల వివరాలు, ఆ మొత్తాలతో ఎలాంటి వ్యక్తిగత జీవనసరళిని కొనసాగించారు వంటి అంశాలను కూడా నివేదికలో పొందుపరిచినట్లు సమాచారం. తక్కువ వేతనం పొందేవారు విలాసవంతమైన జీవనసరళిని ఎలా కొనసాగించారు. ఇందులో దాగివున్న మర్మమేంటనే ప్రశ్నలు రాష్ట్ర స్థాయి అధికారులు వ్యక్తం చేసినట్లు సమాచారం. దీంతో గత అక్రమాల గుట్టువిప్పి కఠిన చర్యలు తీసుకునే అవకాశాలున్నాయని చర్చసాగుతోంది. అయితే బాధ్యులను న్యాయచిక్కులు లేకుండా టర్మినేట్ చేసేందుకు జిల్లా యంత్రంగం కసరత్తు చేస్తున్నట్లు సమాచారం.



ఐసీడీఎస్ అధికారి కార్యాలయం

పీజీ అడ్మిషన్స్ తేదీల్లో మార్పు

అనంతపురంరూరల్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో రెండో విడత పీజీ అడ్మిషన్ల ప్రక్రియకు సంబంధించిన తేదీల్లో మార్పు చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ నరసింహన్ తెలిపారు. బుధవారం నుంచి అడ్మిషన్ల ప్రక్రియ సాగాల్సి ఉండగా.. దానిని ఈనెల 13వ తేదీకి మార్చినట్లు స్పష్టం చేశారు. మూడురోజులపాటు ప్రక్రియ కొనసాగుతుందన్నారు.

జిల్లాలో 6,308 మెట్రిక్ టన్నుల యూరియా

అనంతపురం అర్బన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 6,308 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని పలు రైతు సేవాకేంద్రాల్లో 295, సొసైటీల్లో 126, ప్రైవేటు డీలర్ల వద్ద 1573, హోల్ సేల్ డీలర్లు, ఏపీ మార్క్‌ఫెడ్ వద్ద 3,373, కంపెనీ గోదాముల్లో 142 మెట్రిక్ టన్నులు యూరియా ఉందన్నారు. మరో 799 మెట్రిక్ టన్నులు రవాణా అవుతోందని వివరించారు.

బాలుడి అదృశ్యం



సాయికుమార్ (ఫైల్)

గుత్తి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని గుత్తి ఆర్ఎస్ సుందరయ్య కాలనీకి చెందిన సాయికుమార్ (14) ఈనెల 7న కనిపించకుండా పోయాడు. కుటుంబీకులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 7న ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన సాయికుమార్ తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబీకులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

టమోటా కిలో రూ.20

అనంతపురం రూరల్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో బుధవారం టమోటాలు కిలో గరిష్ఠంగా రూ.20తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరిగా రూ.14తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 2,100 టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

త్వరలోనే శుభవార్త

- మాంచో ఫెర్రర్‌తో టీడీపీ ఎమ్మెల్యేలు



మాంచో ఫెర్రర్‌తో సమావేశమైన మాజీ మంత్రి పల్లె, ఎమ్మెల్యేలు అమిలినేని, ఎంఎస్ రాజు, శ్రావణిశ్రీ, సింధూరా రెడ్డి

అనంతపురం, అక్టోబరు8(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీ విషయంలో కేంద్రం నుంచి త్వరలోనే శుభవార్త అందుతుందని టీడీపీ ఎమ్మెల్యేలు ఆశాభావం వ్యక్తం చేశారు. ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు అమిలినేని సురేంద్రబాబు, ఎంఎస్ రాజు, బండారు శ్రావణిశ్రీ, పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డిలు ఆర్డీటీ సంస్థ నిర్వాహకులు మాంచో ఫెర్రర్‌ను ఆయన నివాసంలో బుధవారం కలిశారు. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ రెన్యువల్ విషయంలో కేంద్రం వద్దకు వెళ్లిన విషయాలు, ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ రెన్యువల్ విషయంపై అంసెబ్లీలో చర్చించిన విషయాలు, కేంద్ర ప్రభుత్వం స్పందించిన తీరు, కేంద్ర మంత్రులు అందించిన సహాయ సహకారాల గురించి ఫెర్రర్‌కు వారు వివరించారు. ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఎంపీలు, కూటమి ప్రభుత్వం, కేంద్ర మంత్రులు ఆర్డీటీని నిలబెట్టేందుకు చేస్తున్న కృషికి మాంచోఫెర్రర్ కృతజ్ఞతలు తెలిపారు.

ఆనాటి స్నేహం.. ఆనందగీతం

46ఏళ్ల తరువాత ఆత్మీయ కలయిక



వాటర్‌ప్లాంటును వితరణ చేస్తున్న పూర్వ విద్యార్థులు

చెన్నేకొత్తపల్లి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): దాదాపు నాలుగున్నర దశాబ్దాల తర్వాత వారంతా ఒక్కచోట కలిశారు. అరమరికలు లేకుండా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ, చిన్ననాటి సంగతులు గుర్తు చేసుకున్నారు. దాదాపు ఆరు పదుల వయసులో బాల్యస్మృతులను నెమరు వేసుకుంటూ ఆనందంగా గడిపారు. నేడు వృద్ధులైన ఒకనాటి విద్యార్థుల అపూర్వ సమ్మేళనానికి చెన్నేకొత్తపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల వేదికగా మారింది. ఈ పాఠశాలలో 1978-79లో పదో తరగతి చదివిన విద్యార్థుల సమ్మేళనం బుధవారం జరిగింది. పాఠశాలలో ప్రస్తుత హెచ్ఎం ఓబుళమ్మ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి నాటి విద్యార్థులు 30 మందికి పైగా హాజరయ్యారు. వివిధ హోదాల్లో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన వారు కొందరైతే, మరికొందరు ఇంకా ఉద్యోగాల్లో కొనసాగుతున్న వారు ఉన్నారు. వీరంతా అప్పటి విషయాలను గుర్తు చేసుకుంటూ తమకు విద్య నేర్పిన నాటి గురువులైన ఆర్. ఆదినారాయణరెడ్డి, చంద్రారెడ్డిలను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాలకు తమ వంతు తోడ్పాటుగా రూ.1.3లక్షలతో ఆర్వో ప్లాంటును సమకూర్చారు.

ప్రమోషన్ల ప్రక్రియ ప్రారంభం



సిబ్బంది నుంచి ఆప్షన్ ఫామ్స్ తీసుకుంటున్న డీపీఓ నాగరాజనాయుడు

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి) ఉమ్మడి జిల్లాలోని గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శుల ప్రమోషన్ ప్రక్రియ ప్రారంభమైంది. సీనియార్టీ జాబితాకు అనుగుణంగా డీపీఓలో బుధవారం ఉమ్మడి జిల్లా డీపీఓలు నాగరాజునాయుడు, సమత ఆధ్వర్యంలో ప్లేస్‌మెంట్స్ కోసం ఆప్షన్ ఫామ్స్ సేకరించారు. జిల్లాలో ఉన్న ఖాళీలకు అనుగుణంగా ప్లేస్‌మెంట్స్ కేటాయించడానికి జాబితా తయారు చేయడంలో సిబ్బంది నిమగ్నం అయ్యారు. కొందరు వారికి కావాల్సిన దగ్గర ప్లేస్‌ల కోసం రాజకీయ నాయకుల నుంచి అధికారులకు ఒత్తిడి తెచ్చినట్లు తెలిసింది. ప్లేస్‌మెంట్స్ ఉత్తర్వులు బయటకు వస్తే గాని ఒత్తిడి పని చేసిందా లేదా అన్నది తేలుతుందని పలువురు చెబుతున్నారు.

వరల్డ్ కప్ మ్యాచ్‌కు స్కోరర్‌గా గుత్తి యువకుడు



కార్తీక్

గుత్తి, అక్టోబరు8(ఆంధ్రజ్యోతి): మహిళల వరల్డ్ కప్ మ్యాచ్‌కు తాను స్కోరర్‌గా ఎంపికైనట్లు మున్సిపాల్టీ పరిధిలోని నూరసింగనపల్లికి చెందిన కార్తీక్ తెలిపాడు. వైజాగ్‌లో జరిగే పోటీకి స్కోరర్‌గా పని చేయాలని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ నుంచి బుధవారం ఆదేశాలు అందినట్లు తెలిపారు. ఈనెల 13న దక్షిణాఫ్రికా, బంగ్లాదేశ్ జట్ల మధ్య జరిగే పోటీకి స్కోరర్‌గా వ్యవహరించనున్నట్లు తెలిపారు.

కాణిపాకం ట్రస్టు బోర్డు సభ్యురాలిగా తాడిపత్రి వాసి



చంద్రకళ

తాడిపత్రి, అక్టోబరు8(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం వరసిద్ధి వినాయక ఆలయ ట్రస్టు బోర్డు సభ్యురాలిగా తాడిపత్రికి చెందిన పరిమి చంద్రకళను ప్రభుత్వం నియమించింది. ఈమె టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సోమశేఖర్ నాయుడు భార్య. బోర్డు సభ్యురాలిగా నియమించడం పట్ల చంద్రకళ హర్షం వ్యక్తం చేశారు. తన నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

న్యూస్ బాక్స్

ఘనంగా దేవతా విగ్రహ ప్రతిష్ఠ



ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

నల్లచెరువు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కమ్మవారిపల్లిలో బుధవారం అభయాంజనేయస్వామి, మహాగణపతి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహాలతోపాటు ధ్వజస్తంభ ప్రతిష్ఠను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నియోజకవర్గ నాయకులు వాల్మీకి పవన్‌కుమార్ రెడ్డి, మండల కన్వీనర్ రాజశేఖర్‌బాబు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ప్రతిష్ఠ సందర్భంగా మూడు రోజుల నుంచి వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించిరు. బుధవారం యంత్ర, విగ్రహ ప్రతిష్ఠ అనంతరం విగ్రహాలకు ప్రత్యేక పూజలు, అలం కారం చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. టీడీపీ మండల మాజీ కన్వీనర్ దాదం వెంకటశివారెడ్డి, మాజీ ఎంపీపీ దాదెం శ్యామలమ్మ, నాయకులు మధుసూదన్‌రెడ్డి తదితర కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ప్రతిష్ఠ కార్యక్రమాలు జరిగాయి.

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ పునరుద్ధరణపై హర్షం

కొత్తచెరువు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏని పునరుద్ధరించడం పట్ల కూటమి నాయకులు బుధవారం ప్రకటనలో హర్షం వ్యక్తంచేశారు. ఆర్డీటీ.. పేదలకు చేస్తున్న సేవల గురించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ కేంద్రం పెద్దలకు వివరించారన్నారు. దీంతో కేంద్రం పెద్దలు ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏను పునరుద్ధరించారన్నారు.

సూపర్ జీఎస్టీపై అవగాహన కల్పించండి: కలెక్టర్

పుట్టపర్తి టౌన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్‌పై విస్తృత అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని కలెక్టరు శ్యాంప్రసాద్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం ఆయన వీడియోకాన్ఫరెన్సు ద్వారా సూపర్ జీఎస్టీ సూపర్‌సేవింగ్స్, గర్ల్‌చైల్డ్‌డే, చెత్తసేకరణ, తల్లికి వందనం, పీఎం సూర్య ఘర్, వ్యవసాయం, రెవెన్యూ వంటి అంశాలపై సమీక్ష చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 11న గర్ల్‌చైల్డ్‌డే కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. 10న పాఠశాలలు, కళాశాలల్లో వ్యాసరచన, వక్తృత్వపోటీలు నిర్వహించి 11న బహుమతులు అందచేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ప్రతి వసతి గృహాన్ని అధికారులు సందర్శించి పరిశుభ్రత, భోజనం, భద్రత తదితర అంశాలను పరిశీలించాలని సూచించారు. తల్లికి వందనం పథకంలో ఉన్న 1719 పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని, పీఎం సూర్యఘర్ పథకంపై ప్రజల్లో చైతన్యం తేవాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో సూర్యనారాయణరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి రామునాయక్, ఐసీడీఎస్ పీడీ ప్రమీల, సీపీఓ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయం తనిఖీ

ధర్మవరం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలని శాఖ గ్రంథాలయాన్ని బుధవారం గ్రంథాల య శాఖ జిల్లా కార్య దర్శి రమ తనిఖీ చేశారు. గ్రంథాల యంలో రికార్డులను తనిఖీచేశారు. రోజూ గ్రంథాలయానికి వస్తున్న పాఠకుల సంఖ్య, సభ్యత్వం తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు అవసరమయ్యే పుస్తకాలు ఉన్నాయని వాటిని పాఠకు లు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. గ్రంథాలయం అభివృద్ధికి కృషి చేయాలని ఆమె స్థానిక గ్రంథాలయ అధికారి అంజలి సౌభాగ్యవతికి సూచించారు.

ఐఎఫ్‌టీయూ కమిటీ ఏర్పాటు

ఓబుళదేవరచెరువు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) నియోజకవర్గం అడహాక్ కమిటీని ఎన్నుకున్నారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో ఐఎఫ్‌టీయూ సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సంఘాల్లో పనిచేసిన శ్రీరాము లు తదితరులు ఐఎఫ్‌టీయూలోకి చేరారు. ఐఎఫ్‌టీయూ ఉమ్మడి అనంతపురం జిల్లా అధ్యక్షుడు యేసురత్నం, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సురేష్ వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం నియోజకవర్గం అడహాక్ కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా శ్రీరాములు, కో కన్వీనర్లుగా ఎస్‌ఎం బషీర్, రామాంజనేయులు, సభ్యులుగా కృష్ణమూర్తి, సుబాన్, రామ్మోహన్, నరసింహులు, రమణ, బాబాజాన్, అహ్మద్‌బాష, చౌడమ్మ, గంగాదేవి, లక్ష్మీదేవి, రామ్మోహన్‌నాయుడు, జయచంద్రరాజు, రమేష్ తదితరులను ఎన్నుకున్నారు. జిల్లా కమిటీ సభ్యులు జావీద్, నరసప్ప పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి పరిటాల శ్రీరామ్ పరామర్శ

ధర్మవరం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): టీడీపీ పట్టణంలోని 18వ వార్డు ఇన్‌చార్జ్ కత్తుల బాబ్జి వారం రోజుల క్రితం రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడి స్థానిక ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాలశ్రీరామ్ బుధవారం ఆస్పత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. పరిటాల శ్రీరామ్ వెంట నాయకులు కమతం కాటమయ్య, చింతలపల్లి మహేశ్ చౌదరి, సంధా రాఘవ, పురుషోత్తం గౌడ్, తోట నారాయణస్వామి తదితరులు ఉన్నారు.

సత్ప్రవర్తనతో మెలగాలి: సీఐ

కదిరి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణ పోలీస్‌స్టేషన్‌లో రౌడీ షీటర్లుగా నమోదైన వారు సమాజంలో మంచి ప్రవర్తనతో మెలగాలని, లేదంటే జైలు శిక్ష తప్పదని పట్టణ సీఐ నారాయణరెడ్డి హెచ్చరించారు. ఆయన బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చి స్థానిక తహసీల్దార్ మురళీక్రిష్ణ ఎదుట బైండోవర్ చేశారు. పలు నేరాల్లో పాత నేరస్థులు 20 మందికి కౌన్సెలింగ్ ఇచ్చారు. భవిష్యత్తులో ఎటువంటి నేరాలకు పాల్పడ కూడదని వారిని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ వారి నుంచి రూ.5లక్షలు సొంత పూచీకత్తు తీసుకున్నారు. నేరాలకు పాల్పడితే జైలుకు పోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. పట్టణంలో ఎవరైనా లాటరీ, మట్కా, పేకాట, గంజాయి వంటి నేరాలకు పాల్పడితే వెంటనే సమాచారం ఇవ్వాలని సీఐ ప్రజలను కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



రమణ (ఫైల్)

ముదిగుబ్బ, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పొడరాళ్లపల్లి క్రాస్ సమీపంలో కారు, ద్విచక్రవాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందినట్లు పట్నం పోలీసులు, స్థానికులు తెలిపారు. బుక్కపట్నం మండలం గనికవారిపల్లికి చెందిన రమణ(40) ముదిగుబ్బ నుంచి బుధవారం రాత్రి ద్విచక్ర వాహనంలో స్వగ్రామానికి వెళుతున్నాడు. బుక్కపట్నం వైపు నుంచి ముదిగుబ్బ వైపు వెళుతున్న కారు పొడరాళ్లపల్లి క్రాస్ సమీపంలో ద్విచక్ర వాహనాన్ని ఎదురుగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంలో వెళుతున్న రమణకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు స్వగ్రామంలో వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు పట్నం పోలీసులు తెలిపారు.

చెక్ డ్యాంల నిర్వహణ అస్తవ్యస్తం

- వృథా అవుతున్న వర్షపు నీరు
- వైసీపీ పాలనలో పట్టించుకోనందుకే..
- ప్రస్తుత ప్రభుత్వంపై రైతుల ఆశలు



ముదిగుబ్బలో కంపచెట్లతో మూసుకుపోయిన చెక్ డ్యాం



నెర్రెలు చీలి, పాచిపట్టిన దృశ్యం

ముదిగుబ్బ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): వర్షపు నీటిని సద్వినియోగం చేసుకోవాలనే లక్ష్యంతో నిర్మించిన చెక్ డ్యాంలు ప్రస్తుతం నిరుపయోగంగా మారాయి. వాటర్ షెడ్ పథకం కింద ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రధా న వాగులపై మొత్తం 3,326 చెక్ డ్యాములను, వంకల్లో 1600 చెక్ వాల్స్ నిర్మించారు. కొన్ని ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో నిర్మించగా, మరికొన్నింటిని ఆర్డీటీ నిధులతో కట్టించారు. ఒక చెక్ వాల్ నిర్మాణానికి రూ. లక్ష నుంచి రూ. 2లక్షలు, చెక్ డ్యాం నిర్మాణానికి రూ. 2లక్షల నుంచి రూ. 5లక్షలు చొప్పున రూ. కోట్లు ఖర్చు చేశారు. ఐదేళ్ల పాటు నిర్వహణ బాగానే ఉన్నా... వాటి కాల పరిమితి తీరిపోవడంతో దిమ్మెలు నెర్రెలు చీలుతున్నాయి. కొన్ని శిథిలావస్థకు చేరుకోగా, వరదలు వచ్చినప్పుడు మరికొన్ని పూర్తిగా కొట్టుకు పోయాయి. ఫలితంగా వాగుల్లో, వంకల్లో వచ్చే వర్షపు నీరంతా దిగువకు వృథాగా పోతోంది.

పూడిక, కంప చెట్లతో నిండిన వైనం

చెక్ డ్యాంలు నిర్మించిన ఐదేళ్ల పాటు ఏటా పూడికతీత చేపట్టారు. 2019 తరువాత చెక్ డ్యాంల మరమ్మతులపై వైసీపీ ప్రభుత్వం దృష్టి సారించకపోవడంతో శిథిలావస్థకు చేరాయి. గండ్లు పడి, బీటలు వారి చాలా అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. దీంతో వర్షపు నీరు ఏమాత్రం నిల్వ లేకుండా వృథాగా పోవడంతో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. గతంలో ఉపాధి హామీ పథకం ద్వారా పూడికతీత, మరమ్మతులు చేపట్టేవారు. ప్రస్తుతం అధికారులు పట్టించుకోకపోవడంతో మట్టితో పేరుకుపోయి, కంపచెట్లు పెరిగి నిరుపయోగంగా మారాయి.

- ముదిగుబ్బ మండలంలోని సంకేపల్లి, బ్రాహ్మణపల్లి వద్ద ఐదేళ్ల కిందట రూ.5 లక్షలతో నిర్మించిన చెక్ డ్యాం రెండేళ్ల కిందట కురిసిన అధిక వర్షాలకు కొట్టుకుపోయింది.

- రాళ్ల అనంతపురం వద్ద నిర్మించిన చెక్ డ్యాంకు గండ్లు పడటంతో నీరు నిల్వ లేకుండా ఒట్టిపోయింది. గతేడాది కురిసిన వర్షాలకు ఎగువ ప్రాంతంలోని మట్టి కొట్టుకొచ్చి చెక్‌డ్యాం పూడిపోయింది. మట్టిపై కంపచెట్లు పెరిగి ప్రస్తుతం నిరుపయోగంగా మారింది.

- మండల కేంద్రంలోని పాతూరు సమీపంలో నిర్మించిన చెక్ డ్యాం నిర్వహణ లేక పోవడం తో కంపచెట్లతో మూసుకుపోయి నిరుపయోగంగా మారింది. ప్రస్తుత ప్రభుత్వమైనా చెక్ డ్యాంల కు మరమ్మతులు చేయించి వ్యవసాయానికి అందుబాటులోకి తేవాలని రైతులు కోరుతున్నారు.

మరమ్మతులు చేయాలి



చెక్ డ్యాంలు నెర్రెలు చీలి, గండ్లు పడి ఉండడంతో వర్షపు నీరు ఏమాత్రం నిలువ లేకుండా పోతోంది. సంబంధిత అధికారులు మరమ్మతులు చేయిస్తే భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉంది. దీంతో వేసవిలో కూడా వ్యవసాయ బోర్లలో నీరు తగ్గకుండా ఉంటుంది. రైతులు సాగునీటి ఇబ్బందులు లేకుండా ఖరీఫ్, రబీ సీజన్‌లలో పంటలు సాగు చేసుకోవచ్చు.

- నారాయణస్వామి, రైతు, జొన్నలకొత్తపల్లి

మరమ్మతులు చేయిస్తే సాగు పెరుగుతుంది



శిథిలావస్థకు చేరుకున్న చెక్ డ్యాంలకు మరమ్మతులు చేయించి రైతులకు అందుబాటులోకి తేవాలి. చెక్‌డ్యాంలు అధ్వానంగా మారడంతో వంకల్లో, వాగుల్లో వచ్చే వర్షపు నీరంతా నిల్వ ఉండకుండా దిగువకు వృథాగా పోతోంది. దీంతో భూగర్భ జలాలు అడుగంటి, వ్యవసాయ బోర్లు ఎండిపోతున్నాయి. సంబంధిత అధికారులు చెక్ డ్యాంలకు మరమ్మతులు చేయిస్తే పంటల సాగు విస్తీర్ణం పెరుగుతుంది.

- పోతలయ్య, సీపీఎం ఏపీ రైతు సంఘం మండల కార్యదర్శి, ముదిగుబ్బ

నివేదికలు పంపుతాం

శిథిలమైన చెక్ డ్యాంలను గుర్తించి ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతాము. ఉన్నతాధికారులు నిధులు మంజూరు చేస్తే దెబ్బతిన్న, నెర్రెలు ఇచ్చిన చెక్ డ్యాంల మరమ్మతుల పనులు చేపడుతాం.

-శ్రీలక్ష్మి, డ్వామా ఇన్‌చార్జ్ పీడీ

అవిశ్రాంత పోరాట యోధుడు చంద్రబాబు

● టీడీపీ నాయకులు



వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

పుట్టపర్తి రూరల్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): అవిశ్రాంత పోరాట యోధుడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడని టీడీపీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, జడ్పీటీసీ మాజీ సభ్యుడు చెన్నకేశవులు కొనియాడారు. మొదటిసారి ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు పదవిచేపట్టి 30 ఏళ్ళు పూర్తి చేసుకున్న సంబరాలను బుధవారం జిల్లా కేంద్రంలోని వృద్ధాశ్రమంలో కేక్‌కట్ చేసి జరుపుకున్నారు. ఈ సందర్భంగా సామకోటి ఆదనారాయణ, చెన్నకేశవులు మాట్లాడుతూ... 15ఏళ్ల ముఖ్యమంత్రిగా, 15ఏళ్ళు ప్రతిపక్షనేతగా సేవలందించిన చంద్రబాబునాయుడు 45ఏళ్ళుగా తన రాజకీయ ప్రస్థానం కొనసాగిస్తున్నారన్నారు. అనంతరం వృద్ధులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ కార్యదర్శి అమ్మినేని కేశవనాయుడు, బీమినేని కిష్టప్ప, మాజీ ఎంపీటీసీ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

కళాశాలకు విరాళం

ధర్మవరం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు దాత గూడురు మోహన్‌దాసు విరాళం అందజేశారు. కళాశాలలో ఒకేషనల్ గ్రూపునకు ప్రింటర్ ఏర్పాటు కోసం రూ. 15వేలను కళాశాల ప్రిన్సిపాల్ వనితావాణి, అధ్యాపకులకు బుధవారం ఆయన అందజేశారు. దీంతో వారు దాతకు కృతజ్ఞతలు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య



మల్లికార్జున రెడ్డి (ఫైల్)

అమడగూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతారెడ్డిపల్లికి చెందిన మల్లికార్జున రెడ్డి(23) అనే యువకుడు బుధవారం ఉరి వేసుకొని ఆత్మహత్య పాల్పడినట్లు గ్రామస్థులు తెలిపారు. మృతుడి తల్లిదండ్రులు ఆరేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. మృతుడికి అక్క మాత్రమే ఉంది. తల్లిదండ్రులు చనిపోయిన తరువాత ఇద్దరూ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో మల్లికార్జునరెడ్డి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్థులు గమనించి స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. అతడి ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

వ్యక్తి మృతిపై విచారణ

తనకల్లు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రబెల్లి గ్రామానికి చెందిన వడ్డె శ్రీరాములు(57) అన్నమయ్య జిల్లా మొలకల చెరువులో మంగళవారం మృతి చెందాడు. ఈ విషయమై సత్యసాయి జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు విచారణ చేపట్టారు. గ్రామానికి వెళ్లి మృతుడి కుటుంబ సభ్యులను విచారించారు. మృతుడు 20 సంవత్సరాలుగా మద్యానికి బానిసై ఇతర ప్రాంతాలలో తిరిగేవాడని, అనారోగ్య కారణాలతో మృతి చెందినట్లు విచారణలో తేలిందని అధికారులు తెలిపారు. విచారణ కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ సూపరిండెంట్ గోవింద నాయక్, ఏఈఎస్ నరసిం హులు, ఎక్సైజ్ పోలీసులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలని వినతి

కదిరి అర్బన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటి పరిధిలోని దివ్యాంగుల కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు వారు బుధవారం మున్సిపల్ డీఈ రెడ్డమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలనీ ఏర్పడి ఏళ్లు గడిచినా మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని తెలిపారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు ఏర్పాటు చేయక పోవడంతో కాలని అభివృద్ధికి నోచుకోలేదన్నారు. వర్షాకాలంలో వీధులన్నీ బురదమయంగా మారి రాకపోకలకు ఆటంకం కలుగుతోందన్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని నాయకులు పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కదిరప్ప, రమణ, మధునాయక్, పవన్, కాలినీ వాసులు శరత్, రెడ్డప్ప, గంగాధర్, రమణమ్మ, రాధమ్మ పాల్గొన్నారు.

కిశోరి వికాసంపై అవగాహన

బుక్కపట్నం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): పౌష్టిక మాసోత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం విద్యార్థులకు కిశోరి వికాసంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పిల్లలకు మానసిక ఆరోగ్యం, ప్రవర్తన ఆధారంగా గ్రేడింగ్ నిర్వహించి వివరించారు. స్పోర్ట్స్ కాంపిటీషన్, బాలికల సంరక్షణ, సైబర్ నేరాలపై తెలియజేసి, రాత పరీక్షలు నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలో గర్భిణులకు అందించే పౌష్టికాహారంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీడీపీఓ జయంతి, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంఈఓ గోపాల్‌నాయక్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పలత, అంగన్‌వాడీ కార్యకర్తలు నాగమణి, జ్యోతి పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై...

ఓబులదేవరచెరువు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లాపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఆర్థిక అక్షరరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఏడీసీసీ బ్యాంక్ మేనేజర్ వెంకటచలం, సహకార సంఘం అధ్యక్షుడు బొల్లం శివారెడ్డి మాట్లాడుతూ... బ్యాంకుకు సంబంధించి ఆర్థిక లావాదేవీలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, సైబర్ సెక్యూరిటీ తదితర విషయాలపై ఖాతాదారులకు అవగాహన కల్పించారు. అనంతరం వారి చేతుల మీదుగా గౌనిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బెస్ట్ పెర్ఫార్మెన్స్‌గా విద్యార్థులకు ప్రశంస ప్రతాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో అల్లాపల్లి పీఏసీఎస్ సీఈఓ రామాంజినేయులు, బ్యాంక్ సిబ్బంది శ్రీనివాసులు, మంజునాథ, అల్లాపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



అప్పటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

కొత్తచెరువు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నమరాజుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2001-02 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వవిద్యార్థుల సమ్మేళనాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుకు చేసుకున్నారు. 25 సంవత్సరాల అనంతరం పూర్వ విద్యార్థులు ఒక చోట కలవడంతో పండుగ వాతారణం నెలకొంది, అనంతరం అప్పటి ఉపాధ్యాయులను పూర్వవిద్యార్థులు శాలువాలతో ఘనంగా సత్కరించారు.

దెబ్బతిన్న వేరుశనగ పంట పరిశీలన

● మొక్కజొన్నలో వాడే గడ్డి మందు పిచికారీ వల్లే: ఏఓ

ఆంధ్రజ్యోతి స్పందన



చిగిచెర్లలో ఎండిపోయిన వేరుశనగ పంటను పరిశీలిస్తున్న ఏఓ

ధర్మవరం రూరల్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): గడ్డిమందు పిచికారి చేయడంతో మండలంలోని చిగిచెర్ల గ్రామానికి చెందిన రైతు సాయినాథ్ రెడ్డి మూడెకరాల్లో సాగుచేసిన వేరుశనగ పంట ఎండిపోయింది. దీనిపై బుధవారం ఆంధ్రజ్యోతిలో 'ముంచిన గడ్డిమందు' అనే శీర్షికతో కథనం ప్రచురితమైన విషయం విదితమే. దీనిపై స్పందించిన మండల వ్యవసా యాధికారి ముస్తఫా సిబ్బందితో కలిసి రైతుపొలాన్ని పరిశీలించారు. రైతుపిచికారి చేసిన మందు అట్రాజైన్‌గా గుర్తించారు. ఈ మందును మొక్కజొన్న పంటకు మాత్రమే పిచికారి చేయాలన్నారు. ఇటువంటి మం దుల పిచికారి వల్ల పంటలు నష్టపోయే ప్రమాదం ఉందని ఏఓ తెలిపారు. పంటలలో గడ్డి మందులు పిచికారీ చేసేటపుడు తప్పనిసరిగా వ్యవసాయాధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఎవరైనా గ్రామాలకు వచ్చి రసాయనిక మందులు అమ్మకాలు జరిపితే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. మందు కొనుగోలు చేసినట్లు రసీదులు లేవని రైతు తెలుపగా, రసాయనిక మందులు కొనుగోలు చేస్తే తప్పకుండా రసీదులు పొందాలని సూచించారు. రైతుకు జరిగిన నష్టంపై ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామని తెలిపారు. ఏఓ వెంట జడ్పీ మాజీచైర్మన్ ఓబిరెడ్డి, రాఘవరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కుంటల వద్దకు పిల్లలను పంపొద్దు: డీఎస్పీ



గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ విజయ్‌కుమార్

పుట్టపర్తి రూరల్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): చిన్నపిల్లలు చెరువులు, నీటికుంటల వద్దకు వెళ్లకుండా తల్లితండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని డీఎస్పీ విజయ్‌కుమార్ సూచించారు. ఎస్పీ ఆదేశాల మేరకు మంగళవారం రాత్రి మండల పరిధిలోని బత్తలపల్లిలో డీఎస్పీ గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ... వర్షాకాలం నేపథ్యంలో ప్రతిచోట చెరువులు, నీటికుంటలు నిండుగా ఉన్నాయన్నారు. కావున చిన్నపిల్లలు చెరువులు, నీటికుంటల వద్దకు వెళ్లకుండా తల్లితండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పేకాట ఆడితే, గంజాయి, అక్రమ మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సైబర్ క్రైం, చీటింగ్, మహిళలు, చిన్నారుల పట్ల నేరాలు, సోషల్ మీడియా దుర్వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. అపరిచితుల కదిలికలపై పోలీసులకు వెంటనే సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ లింగన్న, పోలీసుసిబ్బంది పాల్గొన్నారు.

బాలికలు అప్రమత్తంగా ఉండాలి

కదిరి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): బాలికలు అప్రమత్తంగా ఉండాలని, సమస్యలు ఎదురైన పుడు నంబర్లు 100కు గానీ, 112కు గానీ ఫోన్ చేయాలని డీఎస్పీ శివనారాయణస్వామి సూచించారు. ఆయన బుధవారం స్థానిక బాలికల ఎస్టీ హాస్టల్, కళాశాల విద్యార్థినులతో సమావేశం నిర్వహించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. స్త్రీ శక్తి టీం ఎప్పుడూ అందుబాటులో ఉంటుందన్నారు. హాస్టల్‌లో సమస్యలు ఉంటే అధికారులు దృష్టికి తీసుకరావలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ నేరాలు, సెల్‌ఫోన్ వినియోగం తదితర విషయాలపై వివరించారు. పట్టణ సీఐ నారాయణరెడ్డి, పోలీస్ సిబ్బంది. హాస్టల్ వార్డెన్‌లు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్త

● డిప్యూటీ డీఎంహెచ్ఓ

కదిరి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా సత్వర చర్యలు చేపట్టాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ నాగేంద్రనాయక్ తెలిపారు. పట్టణంలోని ఎన్జీఓ హోంలో బుధవారం కదిరి తూర్పు, పడమర యూనిట్లలోని మేల్ హెల్త్ అసిస్టెంట్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రస్తుతం వర్షాకాలంలో జ్వరాలు, ఇతర వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని తెలిపారు. అవి గ్రామాల్లో వ్యాప్తి చెందకుండా మేల్ అసిస్టెంట్లు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా గ్రామాల్లో జ్వరాలు, లార్వాకు సంబంధించి పక్కాగా సర్వే జరగాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని కోరారు. ప్రతిఒక్కరూ సేకరించిన రక్త నమూనాలను ల్యాబ్‌కు పంపాలన్నారు. సబ్ యూనిట్ అధికారులు దేవాలానాయక్, రామాంజినేయులు, సూపర్‌వైజర్లు మహబుబ్‌బాష, శశిధర్, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో బుక్కపట్నం విద్యార్థి ప్రతిభ



విద్యార్థి సోమశేఖర్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బుక్కపట్నం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): వెయిట్‌లిఫ్టింగ్‌లో బుక్కపట్నం బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి సోమశేఖర్ అత్యుత్తమ ప్రతిభ కనబరచి బంగారు పతకాన్ని సాధించాడు. ఉమ్మడి జిల్లా స్థాయిలో అనంతపురంలో జరిగిన 65 కేజీల వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో ఆ విద్యార్థి పాల్గొని ప్రథమ స్థానంలో బంగారు పతకాన్ని సాధించాడు. రాష్ట్ర స్థాయిలో మంగళగిరిలో జరిగే వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. విద్యార్థి సోమశేఖర్‌ను హెచ్‌ఎం జగదీశ్, పీడీ రామకృష్ణ, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ధర్మవరం విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం, పీడీలు

ధర్మవరం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు నలుగురు రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణప్ప, పీడీలు నాగేంద్ర, నాగరాజు తెలిపారు. అనంతపురంలోని అశోక్‌నగర్‌లో ఉన్న ఇండోర్‌స్టేడియంలో మంగళవారం నిర్వహించిన ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలలో వారు ప్రతిభ కనబరచినట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు అండర్-14 విభాగంలో మధుసూదన్, అండర్-17లో పవన్‌కుమార్, అండర్-19లో అశోక్‌బాబు, అభినాష్ ఎంపికైనట్టు తెలిపారు. వారిని హెచ్‌ఎం, పీడీలు, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

ఆడ బిడ్డలే... అవనికి వెలుగులు

● బాలికా దినోత్సవంలో సీడీపీఓ



కేజీబీవీలో మొక్కలు నాటుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

తనకల్లు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఆడబిడ్డలే అవనికి వెలుగులని నల్లచెరువు ఐసీడీఎస్ సీడీపీఓ వెంకట లక్ష్మమ్మ పేర్కొన్నారు. మండలంలోని రాజువారిపల్లి సమీపంలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలి కా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ సెప్టెంబరు నెలలో జన్మించిన ప్రతి ఆడబిడ్డ పేరు మీద ఒక మొక్క నాటి సంరక్షించాలని కోరారు. ఆడపిల్లలు అన్ని రంగాలలో రాణించాలని సూచించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర పథకాల ప్రాముఖ్యాన్ని వివరించారు. అనంతరం వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ర్యాలీ నిర్వహించిన అనంతరం పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్ఓ అమీదా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, కేజీబీవీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తెలియని వ్యక్తులతో స్నేహం ప్రాణాంతకం

న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి రాజశేఖర్



పోస్టర్లను విడుదల చేస్తున్న అధికారులు

పెనుకొండ టౌన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో తెలియని వ్యక్తులతో స్నేహం ప్రాణాంతకమని అనంతపురం జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి రాజశేఖర్ పేర్కొన్నారు. పెనుకొండ కోర్టు ఆవరణలో చైల్డ్ క్రైంపై బుధవారం అవగాహన కల్పించారు. కార్యక్రమానికి సీనియర్ సివిల్ న్యాయాధికారి వాసుదేవన్, డీఎస్పీ నర్సింగప్ప ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నేటి సమాజంలో పిల్లల ప్రవర్తనపై పెద్దలు ఎప్పటికప్పుడు దృష్టిసారించాలన్నారు. అన్నిశాఖల అధికారులు విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అనంతరం పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్థల పరిశీలన



కర్మాగారం కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఈ

సోమందేపల్లి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గీతానగర్‌లో మురుగునీటి శుద్ధి కర్మాగారం ఏర్పాటుకోసం బుధవారం ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ మురళిధర్ స్థల పరిశీలన చేశారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ మహేష్‌తో కలిసి ఆయన ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. చేనేతలు అధికంగా ఉన్న సోమందేపల్లిలో మురుగునీటివల్ల అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ఈ ప్లాంట్ నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు వారు వివరించారు. మురుగునీటిని శుద్ధిచేయడంవల్ల కాలుష్యం తగ్గి మంచినీటి వనరులు సంరక్షించబడతాయన్నారు. పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందన్నారు. శుద్ధిచేసిన నీటిని వ్యవసాయం, ఇతర అవసరాలకు వాడుకోవచ్చన్నారు. గ్రీన్‌హౌస్ వాయువులను తగ్గించుకోవచ్చన్నారు. ఇందుకు సంబంధించిన ప్రణాళికలు రూపొందించి ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. నిధులు మంజూరుకాగానే కర్మాగార నిర్మాణాన్ని చేపడతామన్నారు. కార్యక్రమంలో నాయకులు నీరుగంటి చంద్ర, పంచాయతీ కార్యదర్శి రామాంజినేయులు, ఆర్‌డబ్ల్యుఎస్ మండల కోఆర్డినేటర్ జగదీశ్ పాల్గొన్నారు.

ఇబ్బందిగా రేషన్ పంపిణీ



అంగన్‌వాడీ సెంటర్‌లో రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్న డీలర్

రొద్దం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): రేషన్ పంపిణీ ఇబ్బందిగా మారింది. మండలంలోని చెరుకూరు గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రానికి భవనం లేకపోవడంతో కొన్నేళ్లుగా స్త్రీశక్తి భవనంలో నిర్వహిస్తున్నారు. డీలర్ అక్కడే బియ్యం బస్తాలు వేసుకుని ప్రతినెలా లబ్ధిదారులకు రేషన్ అందిస్తున్నారు. దీంతో పిల్లలు కూర్చునేందుకు వీలులేకుండా పోతోందని, రేషన్ కోసం వచ్చే జనంతో పిల్లలకు ఇబ్బందికరంగా మారిందన్న విమర్శలున్నాయి. రెవెన్యూ అధికారులు స్పందించి అంగన్‌వాడీ కేంద్రాన్ని మార్పు చేయాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఇన్‌చార్జి సీఎస్‌డీటీ సావిత్రిని వివరణ కోరగా త్వరలోనే రేషన్ షాపును మార్చి ఇబ్బందిలేకుండా చూస్తామన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థి



విద్యార్థిని అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

పరిగి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి పోటీలకు ఐకాన్ జూనియర్ కళాశాల విద్యార్థి షాహీద్ ఎంపికయ్యాడు. అనంతపురం జూనియర్ కళాశాల మైదానంలో గురువారం నిర్వహించిన వంద మీటర్లు, 200మీటర్ల పరుగు పందెంలో రెండో స్థానంలో నిలిచాడు. దీంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం డాక్టర్ సురేష్‌కుమార్, ప్రిన్సిపాల్ బైడిశెట్టి విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలో ఎన్‌లైట్ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ బాబాఖాన్, వెంకటనందన్, అశ్విని, శంకర్, కార్తీక్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

బిట్ కళాశాల చైర్మన్ జన్మదిన వేడుకలు



వృద్ధాశ్రమంలో భోజనాలు వడ్డిస్తున్న విద్యార్థినులు

హిందూపురం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): బిట్ కళాశాల చైర్మన్ చంద్రమోహన్ 70వ జన్మదిన వేడుకలను బుధవారం హిందూపురంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కళాశాలలో ప్రిన్సిపాల్ రమేష్ ఆధ్వర్యంలో కేక్‌కట్‌చేసి పంచిపెట్టారు. అనంతరం సేవాకార్యక్రమాలు చేపట్టారు. పట్టణంలోని వృద్ధాశ్రమంలో అన్నదానం, వారికి అవసరమైన వస్తువులు అందించారు. వీటితోపాటు కళాశాల విద్యార్థులు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

ఇన్‌చార్జి ఎస్ఐగా వీరాంజనేయులు

రొద్దం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): రొద్దం ఎస్ఐ నరేంద్ర ఇటీవల కర్నూలుకు బదిలీకాగా ఇన్‌చార్జి ఎస్ఐగా వీరాంజనేయులు బుధవారం బాధ్యతలు చేపట్టారు. రొళ్ల స్టేషన్‌లో ఈయన పనిచేస్తున్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సిబ్బంది కొరతతో ఇబ్బందులు

ప్రభుత్వ కార్యాలయాల్లో ఖాళీగా పోస్టులు

ఇన్‌చార్జిల నియామకంతో పరిష్కారం కాని సమస్యలు



తహసీల్దార్ కార్యాలయం

మడకశిర రూరల్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): నిత్యం ప్రజలకు ఎంతో అవసరమైన రెవెన్యూ, మండల పరిషత్, వ్యవసాయ, పశు సంవర్ధకశాఖల్లో అధికారులు లేకపోవడంతో నియమించాలని ప్రజలు కోరుతున్నారు. ఎంతో వ్యయప్రయాసలకోర్చి తాము కార్యాలయాలకు వస్తే వారు అందుబాటులో లేకపోవడంతో తమ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయని వారు అంటున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో ఇన్‌చార్జిలు ఉన్నా వారు వారానికి రెండు రోజులు మాత్రమే వస్తున్నారని, ఏ రోజుల్లో వస్తారో తెలియక తాము సతమతమవుతున్నామని పేర్కొంటున్నారు.

రెవెన్యూ శాఖలో..

రెవెన్యూశాఖకు సంబంధించి తహసీల్దార్, మండల సర్వేయర్‌తోపాటు ఆరుగురు వీఆర్‌ఓలు బదిలీపై వెళ్లారు. దీంతో ఆ పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. తహసీల్దార్ పదవీ విరమణ చేయడంతో పరిగి తహసీల్దార్‌ను ఇన్‌చార్జిగా నియమించారు. ఆయన వారానికి కేవలం రెండు రోజులు మాత్రమే వస్తుండటంతో ప్రజలు ఇబ్బందులుపడుతున్నారు. ప్రజాసమస్యల పరిష్కార వేదికలోనైనా తమ సమస్యలను చెప్పుకుందామంటే ఆయన జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయానికి వెళ్తుండటంతో తమకు ఇబ్బందులు తప్పడంలేదని అంటున్నారు. కొంతమంది జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి తమ సమస్యలను తెలుసుకుంటున్నారు. మండల సర్వేయర్ మూడు నెలలక్రితం బదిలీపై పరిగి మండలానికి వెళ్లారు. ఆయననే ఈ ప్రాంతానికి ఇన్‌చార్జిగా వేశారు. భూముల రీసర్వేలో ఆయన బిజీబిజీగా ఉంటుండటంతో తమకు ఇబ్బంది తప్పడంలేదని ప్రజలు అంటున్నారు. ఇక వైబి హళ్లి, మణూరు, జీవీ పాళ్యం, కదిరేపల్లి, హరేసముద్రం-2, ఏఆర్ రొప్ప సచివాలయాల పరిధిలో వీఆర్‌ఓలు లేరని, తమ సమస్యలను ఎవరికి విన్నవించుకోవాలని వారు ప్రశ్నిస్తున్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి సిబ్బందిని కేటాయించాలని కోరుతున్నారు.

మండల పరిషత్ కార్యాలయంలో..

మండల పరిషత్ కార్యాలయంలో ఈఓఆర్డీతోపాటు ఆరుగురు పంచాయతీ కార్యదర్శుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇక్కడ పని చేసిన వారు బదిలీపై వెళ్లారు. దీంతో ఆ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కొన్ని రోజులు గుడిబండ ఈఓఆర్డీని ఇన్‌చార్జిగా నియమించారు. ప్రస్తుతం ఆయన కూడా లేరు. అదేవింగా కల్లుమర్రి, మణూరు, మెళవాయి, గోవిందాపురం ఆర్ అనంతపురం, హరేసముద్రం-2 గ్రామ సచివాలయాల పరిధిలో పంచాయతీ కార్యదర్శులు లేక అభివృద్ధి, పారిశుధ్యం కుంటుపడుతోందని ఆయా ప్రాంతాల స్థానికులు అంటున్నారు. వెంటనే సిబ్బందిని నియమించి అభివృద్ధికిబాటలు వేయాలని వారు కోరుతున్నారు.

పశుసంవర్ధక శాఖలో..

మండలంలోని కల్లుమర్రి, గుండమల, మడకశిర, నీలకంఠాపురం గ్రామాల్లో పశువైద్యశాలలు ఉన్నాయి. ఇక్కడ వెటర్నరీ డాక్టర్లు లేరు. కేవలం కాంపౌండర్, సచివాలయాల సిబ్బంది మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. సచివాలయ సిబ్బంది సరైన పర్యవేక్షణ లేకపోవడం తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. వెటర్నరీ డాక్టర్‌ను నియమించాలని, సచివాలయ సిబ్బంది తమకు అందుబాటులో ఉంటూ సలహాలు, సూచనలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

వ్యవసాయ శాఖలో..

వ్యవసాయశాఖకు సంబంధించి ఏడీఏ రెండు నెలల క్రితం బదిలీపై వెళ్లారు. ఆ పోస్టు ఖాళీగా ఉన్నా ఇప్పటి వరకు మరొకరిని ఆస్థానంలో నియమించలేదు. ఇప్పటికైనా సంబంధిత శాఖల ఉన్నతాధికారులు స్పందించి ఆయా శాఖల్లో అధికారులను, సిబ్బందిని నియమించి తమ సమస్యల పరిష్కారానికి పాటుపడాలని ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం

మడకశిలో తహసీల్దార్, వీఆర్‌ఓలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నాం. కార్యాలయం వద్దకు వెళ్లి సిబ్బంది లేకపోవడంతో వెనుతిరిగి రావాల్సి వస్తోంది. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే తహసీల్దార్‌ను, వీఆర్‌ఓలను నియమించాలి. తమ సమస్యల పరిష్కారానికి చొరవచూపాలి.

- వేమారెడ్డి, పాపసానిపల్లి

వన్యప్రాణుల సంరక్షణ.. అందరి బాధ్యత

సత్యసాయి కళాశాల ప్రిన్సిపాల్ ఆదిశేషారెడ్డి



పరిటాల శ్రీరాములు కళాశాలలో ప్రసంగిస్తున్న ప్రిన్సిపాల్ జయప్ప

పెనుకొండ, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): వన్యప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని సత్యసాయి కళాశాల ప్రిన్సిపాల్ ఆదిశేషారెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక సత్యసాయి కళాశాలలో 73వ జాతీయ వన్యప్రాణి వారోత్సవాలను అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. అటవీశాఖ రేంజర్ శ్రీనివాసులురెడ్డి, ప్రిన్సిపాల్ ఆదిశేషారెడ్డి ప్రకృతిలో వన్యప్రాణుల ప్రాముఖ్యత, మనుగడ, వాటిసంరక్షణలో మానవుని పాత్ర గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. విచక్షణారహితంగా అడవులను నరుకుతూ జంతువుల ఆవాసాలను నాశనం చేయడం మంచిదికాదన్నారు. జంతువుల సంరక్షణపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ చూపాలన్నారు. అనంతరం జంతు సంరక్షణపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ గౌతమి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో..

స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీకళాశాలలో జంతుశాస్త్రం విభాగం, అటవీశాఖ సంయుక్తంగా వన్యప్రాణ వారోత్సవాలు ప్రిన్సిపాల్ జయప్ప అధ్యక్షతన జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో మానవమనుగడ సాగాలంటే ప్రకృతిలోని ప్రతిజీవిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. బీట్ ఆఫీసర్ గౌతమి ప్రకృతిలో వన్యప్రాణుల సంరక్షణ, ప్రాముఖ్యత, మానవుని పాత్రను వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రామన్న, ఐక్యూ కోఆర్డినేటర్ యశోదరాణి, జంతుశాస్త్ర అధ్యాపకులు హరీష్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

సభను విజయవంతం చేయండి

1998 డీఎస్సీ ఉపాధ్యాయులు

రొళ్ల, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఈ నెల 11న జరగనున్న సభకు హాజరై విజయవంతం చేయాలని 1998 డీఎస్సీ ఎంటీఎస్ ఉపాధ్యాయులు పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని స్థానిక లక్ష్మీనరసింహస్వామి కమ్యూనిటీ భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 1998 ఎంటీఎస్ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని, పదవీ విరమణ వయసు 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే విడుదల చేయాలని, హెల్త్‌కార్డ్ ఇవ్వాలన్నారు. అదేవిధంగా పదవీ విరమణ తరువాత రూ.25వేలు పింఛన్ ఇవ్వాలని తదితర సమస్యలపై ప్రభుత్వానికి విన్నవించేందుకు సభ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మడకశిర డివిజన్ వ్యాప్తంగా పనిచేస్తున్న ఎంటిఎస్ ఉపాధ్యాయులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం ఎంజారప్ప, నాగేంద్రప్ప చేయాలన్నారు.

ఐడీ కార్డుల పంపిణీ

గోరంట్ల, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం ఐడీ కార్డులు పంపిణీ చేశారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ఉండాలని, ప్రభుత్వ పాఠశాలలోని 156 మంది విద్యార్థులకు హెచ్‌ఎం విజయసింహారావు సొంత ఖర్చుతో ఐడీ కార్డులు అందజేశారు.

భూమిపూజకు సర్వం సిద్ధం



ఎక్స్‌కవేటర్‌తో స్థలాన్ని చదును చేస్తున్న దృశ్యం

అమరాపురం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం భవనం, ప్రహరీ భూమిపూజకు సర్వం సిద్ధమవుతోంది. శుక్రవారం భూమి పూజ కార్యక్రమం నిర్వహించనున్నారు. కార్యక్రమానికి ఎస్సీ కమిషన్ చైర్మన్ కెఎస్ జవహర్, ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు, హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి హాజరుకానున్నారు. కార్యక్రమానికి పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు, దళితులు హాజరై విజయవంతం చేయాలని ఎస్సీసెల్ అధ్యక్షులు జయకుమార్, నాగరాజు, శకున్నప్ప, హనుమంతరాయప్ప నవీన్ కుమార్, శివకుమార్, నరసింహమూర్తి, మల్లేష్ తదితరులు కోరారు.

విద్యార్థినులకు పోటీలు

రొద్దం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): కిశోరి వికాసంపై విద్యార్థులకు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పలు పోటీలు నిర్వహించారు. గురువారం రొద్దంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ తరఫున అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా కబడ్డీ, ఖో-ఖో తదితర పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు హసీనా, అరుణ, ముత్యాలమ్మ పాల్గొన్నారు.

గోరంట్ల(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, సచివాలయాల పరిధిలో కిశోర బాలికలకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలను బుధవారం నిర్వహించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి. గోరంట్లలోని బాలికల ఉన్నత పాఠశాలలో పిల్లల హక్కులు, లింగసమానత్వం, బాల్యవివాహ నిర్మూలనపై వ్యాసరచన పోటీలు నిర్వహించగా కార్యక్రమాన్ని పెనుగొండ డీవైఈవో జాన్ రెడ్డప్ప పరిశీలించారు. పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు అంతర్జాతీయ బాలికా దినోత్సవ కార్యక్రమంలో బహుమతులు అందజేస్తారన్నారు. గురువారం మండల కేంద్రమైన గోరంట్లలో ఉదయం 10 గంటలకు జరిగే ర్యాలీలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మాలతి, ఎంఎస్కేలు సరస్వతి, కాంచన, అంగన్‌వాడీ కార్యకర్తలు నాగజ్యోతి, జ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.

సోమందేపల్లి(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో వక్తృత్వ పోటీలను సీడీపీఓ శాంతలక్ష్మి నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. బాలికా దినోత్సవం సందర్భంగా పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. ఇందులో ప్రతిభ కనబరచిన విద్యార్థినులకు బహుమతులు అందజేస్తామన్నారు.



సోమందేపల్లిలో మాట్లాడుతున్న సీడీపీఓ

అశ్వవాహనంపై శ్రీవారు



తాడిపత్రి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక చింతల వెంకట రమణస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారు అశ్వవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి ఉత్సవ మూర్తికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు.

ఘనంగా వీరభద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ

పెద్దవడుగూరు, అక్టోబరు8(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రం సమీపంలో నిర్మించిన వీరభద్ర స్వామి ఆలయంలో స్వామివారి విగ్రహాన్ని బుధవారం ప్రతిష్ఠించారు. స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. రాత్రి ఆణిముత్యాలు పౌరాణిక నాటకాన్ని ప్రదర్శించారు.

ప్రభుత్వ పథకాలపై

అవగాహన కల్పించండి

అధికారుల సమీక్షలో మంత్రి సవిత



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని మంత్రి సవిత పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఆర్‌అండ్‌బి అతిథిగృహంలో పెనుకొండ, పరిగి, సోమందేపల్లి మండలాల అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ ఇప్పటికే ఆయా మండలాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను వివరించారు. కొత్త పనులకు అంచనా వేయాలని సూచించారు. అత్యవసరంగా ఉన్న పనులు శరవేగంగా చేయాలని తెలిపారు. పనులు సమయానికి నాణ్యతతో పూర్తి కావాలని సూచించారు. త్వరలో అర్హులైన పేదలకు ఇంటి నిర్మాణాలు మంజూరు చేయిస్తామన్నారు. మంచినీటి సమస్య ఎక్కడా లేకుండా చూడాలని, పారిశుధ్యంపట్ల నిర్లక్ష్యంవహించరాదన్నారు. కార్యక్రమంలో అన్నిశాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

వాల్మీకుల హక్కుల సాధనకు కృషి

అనంత ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ



పూజల్లో పాల్గొన్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

హిందూపురం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): వాల్మీకుల హక్కుల కోసం కృషి చేస్తానని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. వాల్మీకి ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో ఆయన పాల్గొన్నారు. బుధవారం బెంగళూరు రోడ్డులో ఉన్న వాల్మీకి కల్యాణమండపంవద్ద వాల్మీకి సంఘం నాయకులు ఎంపీని సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాయలసీమలోనే మొదటిసారిగా హిందూపురంలో వాల్మీకి కల్యాణమండపం ఉండటం కులస్థుల తోడ్పాటుతోనే సాధ్యమైందన్నారు. వాల్మీకులు ఎస్టీ హక్కుల సాధనకోసం ఐక్యంగా ముందుకు సాగుదామని అంబికా అన్నారు. అదేవిధంగా హిందూపురంలో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సహకారంతో వాల్మీకుల హక్కుల కోసం ఢిల్లీలో తనవంతు కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం అధ్యక్షులు వెంకటరమణ, గౌరవాధ్యక్షులు ఆదినారాయణ, ఆకుల సూరీ, నర్సింహమూర్తి, లోకేష్, అశోక్, టీకే బాబు, అంజి, నరేష్, వైఎల్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళాలు అందజేస్తున్న రమణ దంపతులు

హిందూపురం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న లక్ష్మీనరసింహస్వామి ఆలయ నిర్మాణానికి రమణ, శీల, నిహాల్ రూ.2లక్షలు విరాళాన్ని కమిటీ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో రాఘవేంద్ర, నిమ్మకాయల రాము, అమర్, మనోజ్ పాల్గొన్నారు.

అవిశ్వాస తీర్మానం పెట్టాలి: ఎంపీటీసీలు



ఆర్డీఓకు వినతిపత్రం అందిస్తున్న ఎంపీటీసీలు

రొళ్ల, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండల ప్రజాపరిషత్ అధ్యక్షురాలు కవితతోపాటు వైస్ ఎంపీపీలు నాగరాజు, రత్నమ్మలపై అవిశ్వాస తీర్మానం పెట్టాలని బుధవారం ఎంపీటీసీలు కోరారు. మండలంలోని ఎనిమిది మంది ఎంపీటీసీలు జిల్లాపరిషత్ సీఈఓ, పెనుకొండ రెవెన్యూ డివిజనల్ అధికారి, స్థానిక ఎంపీడీఓకు ఈ మేరకు వినతిపత్రం అందించారు. మండల గ్రాంట్‌ను ఎంపీటీసీలకు తెలియకుండా ఇతరులకు కేటాయించి తమకు అన్యాయం చేశారని వారు ఆరోపించారు. వారిని ఆ పదవుల నుంచి తప్పించి పాలక వర్గాన్ని రద్దు పరచాలని కోరారు. కొత్త పాలక వర్గాన్ని ఎన్నుకునేలా వెంటనే చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీలు అధికారులను కోరారు. వినతిని అందించిన వారిలో ఎంపీటీసీలు జగదీశ్‌బాబు, లింగరాజు, నాగరాజు, శివన్న, లక్ష్మీ, సౌమ్య, సుమ, విశాలక్షి తదితరులు ఉన్నారు.

జీఎస్టీపై అవగాహన కల్పించాం: ఎంపీడీఓ

పెనుకొండ రూరల్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్టిపల్లిలో సూపర్ జీఎస్టీ సూపర్‌సేవింగ్స్‌పై అవగాహన కల్పించినట్లు ఎంపీడీఓ నరేష్‌కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన 12శాతం జీఎస్టీను 5 శాతానికి తగ్గించడంతో వ్యాపారస్థులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. అనంతరం ఎంపీయుపీ పాఠశాలలో మంత్రి సవిత సహకారంతో విద్యార్థులకు డెయిరీలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీఓ రవీంద్రరెడ్డి, మండల మాజీ కన్వీనర్ సిద్దయ్య, హెచ్‌ఎం సుకన్య పాల్గొన్నారు.



విద్యార్థులకు డైరీలు పంపిణీ చేస్తున్న నాయకులు